# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

బుధవారం, సెప్టెంబరు 25, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

### మళ్లీ దీపావళి వస్తున్నా పొంగులేటి చెప్పిన బాంబులు పేలలేదు: కేటీఆర్



హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయమని, వాటిల్లో ఎన్ని గిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ పార్టీకి ఓటమి తథ్యమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'అబద్ధపు హామీలతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయలేక.. పదేపదే గత



## ఆయుధాలు వదిలేస్తాం..!

**మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం.. అభయ్ పేరిట ప్రకటన**

**సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు వెల్లడి**

**బస్వరాజ్ ఆలోచనలకు అనుగుణంగానే శాంతి చర్చలని స్పష్టత**

**సహచరులతో సంప్రదించేందుకు నెల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి**

హైదరాబాద్: మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. భారతదేశంలోని పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని పేర్కొంది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. అభయ్ పేరుతో చలామణి అవుతున్న కిషన్‌జీ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ తాజా చిత్రాన్ని ఈ ప్రకటనలో ముద్రించడంతోపాటు తమ నిర్ణయంపై ప్రజలెవరైనా తమ అభిప్రాయాలు పంచుకునేందుకు ఈ-మెయిల్, ఫేస్‌బుక్ ఐడీలను మావోయిస్టుపార్టీ ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వం తమ ప్రతిపాదనను అంగీకరించిన వెంటనే ప్రజలు తమ ఆలోచనలు పంచుకునేందుకు వీలుగా ఈమెయిల్ (nampet(2025)@gmail.com%), ఫేస్‌బుక్ (nampetalk) ఐడీలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. వాస్తవానికి మావోయిస్టులు గతంలో ఎన్నడూ ఇలా చేసిన దాఖలాల్లేకపోవడంతో ప్రకటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నా.. నిఘావర్గాలు మాత్రం ఇది నిజమైన ప్రకటన అనే అభిప్రాయపడుతున్నాయి.



## కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఘనంగా స్వాగతం

హైదరాబాద్ సెప్టెంబర్ 16: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ మంగళవారం సాయంత్రం బేగంపేట ఎయిర్పోర్ట్ చేరుకున్నారు. బేగంపేట ఎయిర్పోర్ట్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు , బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు & పార్లమెంట్ సభ్యులు , డి కె అరుణ,బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్ మరియు పార్లమెంట్ సభ్యులు, బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.


# సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి

### నరేంద్రమోడీ 75వ పుట్టిన రోజు



గాంధీనగర్, సెప్టెంబర్ 16: ప్రపంచ యవనికపై అగ్రరాజ్యం అమెరికా విధించిన ఆంక్షలను తట్టుకుంటూ భారతదేశం సగర్వంగా తలెత్తుకుని నిలబడింది. మరిన్ని దేశాలకు ఆదర్శంగా నిలిచింది.. దీనికి కారణం భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని అంటారు రాజకీయ విశ్లేషకులు. ప్రస్తుతం నరేంద్ర మోడీ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ నాయకులలో ఒకరిగా పరిగణించబడే ప్రధాని మోడీ సెప్టెంబర్ 17, 2025న తన 75వ పుట్టినరోజును జరుపుకోనున్నారు. ఒక సామాన్య ప్రచారకర్త నుంచి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ తర్వాత దేశ ప్రధానమంత్రి వరకు ఆయన ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం.ప్రధానమంత్రి మోడీ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వాద్‌నగర్ అనే చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన బాల్యం అత్యంత పేదరికంలో గడిచింది. ఆయన తండ్రి దామోదర్‌దాస్ ముల్చంద్ మోడీతో కలిసి వాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో టీ అమ్మేవారు. ఆయన తల్లి హీరాబెన్ ఒక సాధారణ గృహిణి. నలుగురు తోబుట్టువుల్లో మూడవ సంతానం ప్రధాని మోడీ. రేపు ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా అరుదైన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానమంత్రి మోడీ చిన్నప్పటి నుంచి చాలా ఆశయంతో ఉండేవారని.. దేశానికి ఏదైనా సేవ చేయాలనే కల కనే వారని మోడీ పాఠశాల స్నేహితులు చెబుతున్నారు. ఆయనకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. పాఠశాలలో చర్చా పోటీల్లో పాల్గొనేవారు. స్థానిక లైబ్రరీలో గంటల తరబడి చదువుతూ గడిపేవారు. ఆయనకు చిన్నప్పటి

- మిగతా 2వ పేజీలో



## రెండు కాళ్లు కోల్పోయిన యువకుడికి అండగా సీఎం రేవంత్

హైదరాబాద్: రెండు కాళ్లు కోల్పోయి ఇక జీవితం అయిపోయిందని తీవ్ర ఆందోళనకు గురైన ఆ విద్యార్థికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందించిన ప్రోత్సాహంతో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యమంత్రి చూపించిన దాతృత్వానికి ఆ విద్యార్థి, అతనితో పాటు కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో రేవంత్ రెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వరంగల్ జిల్లా దామెర మండలం పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ జీవితంలో ఐఐటీ సాధించాలన్న పట్టుదలతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2024 నవంబర్ 2 న రాజస్థాన్ కోటాలో శిక్షణ కోసం రైలులో ప్రయాణిస్తున్న సందర్భంలో గుర్తుతెలియని దుండగులు ఆ విద్యార్థిపై దాడి చేసి రైలు నుంచి బయటకు తోసేశారు. ఈ ఘటనలో విద్యార్థి తన రెండు కాళ్లను పూర్తిగా కోల్పోయాడు.

ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో స్పందించి, ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ విద్యార్థికి అత్యంత అధునాతన కృత్రిమ కాళ్లను అమర్చే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాహుల్ను నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు 10 లక్షలకు పైగా వెచ్చించి ఆ యువకుడికి ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చారు. కొద్ది రోజులుగా ఒక్కో అడుగు వేస్తూ నడవడం ప్రారంభించిన రాహుల్ ఇప్పుడు సంపూర్ణంగా కోలుకుని ఆత్మ విశ్వాసంతో నడవగలుగుతున్నాడు. రెండు కాళ్లు కోల్పోయిన తనకు మళ్లీ నడవగలిగే విధంగా అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించిన ముఖ్యమంత్రి కి రాహుల్ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రాహుల్ భుజం తట్టి భవిష్యత్తులో బాగా చదువుకుని రాణించాలని ప్రోత్సహించారు.

## కోట్లకు పడగలెత్తిన విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్

### అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు





హైదరాబాద్ , సెప్టెంబర్ 16: ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ ఇంట్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారజాము నుంచి సాయంత్రం 5 గంటల వరకు విరామం లేకుండా సోదాలు నిర్వహించారు ఏసీబీ అధికారులు. ఏడీఈ అంబేద్కర్ నివాసంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు మొత్తం 15 బృందాలుగా విడిపోయి గచ్చిబౌలి , మాదాపూర్ , హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో పలుచోట్ల సోదాలు చేపట్టి.. ఆస్తుల వివరాలు సేకరించారు. అంబేద్కర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.ఏడీఈ అంబేద్కర్ కోట్లకు పడగలెత్తినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. శేరిలింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో జీ ప్లస్ 5 భవనం, పది ఎకరాల్లో అమ్తర్ కెమికల్స్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌లో ఆరు రెసిడెన్షియల్ ప్రైమ్ ఓపెన్ ప్లాట్స్, ఒక వ్యవసాయ క్షేత్రం, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# 2029కి 39 శాతానికి 2047 50 శాతానికి గ్రీన్ కవర్ చేరుకోవాలి

### జనవరి నుంచి వేస్ట్ అనేది ఎక్కడా కనిపించకూడదు: సీఎం చంద్రబాబు

అమరావతి: రెండో రోజు కలెక్టర్ల సదస్సులో స్వచ్ఛాంధ్ర, అటవీ, మున్సిపల్, పంచాయితీరాజ్ తదితర శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కోసం కార్పోరేషన్ ద్వారా నిధులు ఇస్తాం. స్వచ్ఛభారత్ కోసం ఏ జిల్లాలో అయినా పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాలు చేపడితే అది రాష్ట్రమంతా వర్తింప చేయండి. ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు మన సంస్కృతీ సంప్రదాయం, ఆ వృక్షాలు పెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఘన వ్యర్థాల షెడ్లు నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నాం. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించండి.

చేతివృత్తులు, కులవృత్తులు దెబ్బతినకుండా కాపాడాలి. సీసీ రోడ్ల నిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వకుండా పైపులైన్లు పెట్టేలా ఎస్ఓపీ చేయండి. ఏజెన్సీ ప్రాంతాల్లో అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయితీలుగా తీర్చిదిద్దండి. రూరల్ ఏరియా అర్బన్ సౌకర్యాలతో ప్రాంతాలను అభివృద్ధి చేయండి. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ ను ఓ ఉద్యమంగా రాష్ట్రంలో చేస్తున్నామని అన్నారుజ.

సింగపూర్ విధానాలను పరిశీలించి ఉమ్మడి రాష్ట్రంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాం. ఆ తర్వాత క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పరిశుభ్రం పేరిట కార్యక్రమాలు నిర్వహించాం. స్వచ్ఛత అంటే క్లీన్లినెస్ ఒక్కటే కాదు ప్రజల థింకింగ్ ప్రాసెస్ కూడా మారాలి. ఇంట్లో చెత్తను రోడ్డు బయట వేయటం కొందరికి అలవాటు. అలాగే డ్రెయిన్స్ లో చెత్తవేయటం వల్ల అవి అడ్డుపడి నీటి ప్రవాహానికి అడ్డుపడుతుంది.



గతంలో హ్యాపీ సండే నిర్వహించాం. ప్రజలు తమ టాలెంట్ ను ప్రదర్శించేవారు. లాఫింగ్ సొసైటీ నుంచి షౌటింగ్ సొసైటీల వరకూ వెళ్లాయి. జాతరలు అన్నీ ప్రజల గ్యాదరింగ్ కోసమే నిర్వహించే వారు. స్వచ్ఛతాహీ సేవ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 తేదీ వరకూ చేపట్టాలి. సర్క్యులర్ ఎకానమీ పాలసీలు. ఐదు జోన్లలో ఐదు సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేస్తాం. సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అనేది సక్రమంగా జరగాలి. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయిన్లు సరిగ్గా లేవు. మేజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టాలి. చాలా చోట్ల మరుగుదొడ్లు లేవు. వాటి వాడకం కూడా జరగటం లేదు. పంచాయితీల్లో పిట్స్ ను ఎప్పటికప్పుడు

- మిగతా 2వ పేజీలో




## బిఆర్ఎస్ కబ్జాకు ట్రబుల్ షూటర్ నయ స్కెచ్.. సామా రామమోహన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16: బిఆర్ఎస్ ను కబ్జా చేసేందుకు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు నయ స్కెచ్ కు కుట్ర పన్నారని పిసిసి అధికార ప్రతినిధి సామా రామమోహన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కేటీఆర్ ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ ఆఫీసు కి పంపించే ప్రయత్నం కుట్రలోని బాగమే నని ఆయన పేర్కొన్నారు.జోనల్ ఆఫీసు కర్ణాటకలో ఉందని,ఈడి కేసులో హిరోయిన్ కేటీఆర్ మీద ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కేటీఆర్ ను జైలుకు పంపే ప్రయత్నం చేశ్రుస్తున్నారని పేర్కొన్నారు. కేసిఆర్ కుటుంబంలో ఇప్పటికే ఒకరు బయటకి వెళ్లిపోయారు,బిఆర్ఎస్ బిగ్ వికెట్ అయిన కేటీఆర్ ను బయటకి పంపే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారన్నారు.బిఆర్ఎస్ నాకౌట్ మ్యాచ్లో జరుగుతున్న ఇంట్రెస్టింగ్ పోరు లో టర్నింగ్ పాయింట్ కేటీఆర్ ఇష్యు అని బీజేపీ తాడు పట్టుకొని కేటీఆర్ ను ఇరికించే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారన్నారు. దీనితో బీఆర్ఎస్ పార్టీ ఇంకా తెలంగాణ లో నిలబడదన్నారు.



## 2029కి 39 శాతానికి 2047 50 శాతానికి గ్రీన్ కవర్ చేరుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

క్లీన్ చేసేలా చూడాలి. అత్యవసర పనులకు నిధులు తక్షణం మంజూరు చేస్తాం. నెట్ జీరో, వేస్ట్ టూ వెల్త్ కాన్సెప్టుతో పనిచేయాలి. గ్రీన్ కవర్ పెంచడానికి కృషి చేయండి. 2029కి 39 శాతానికి 2047 50 శాతానికి గ్రీన్ కవర్ చేరుకోవాలి కార్పోరేట్ సెక్టార్ ను కూడా గ్రీన్ కవర్ పెంచటంలో ఇన్వాల్వ్ చేయాలని డిప్యూటీ సీఎంకు సూచన చేసారు. 10-20 మంది కార్పోరేట్లకు కొంత ప్రాంతం ఇస్తే ఫారెస్టు ఏరియాను అభివృద్ధి చేస్తారు. నగర వనాలు కూడా అభివృద్ధి చేయాలని అన్నారు. కార్తీక మాసాన్ని కూడా సెలెబ్రేట్ చేసుకుందాం. ఎకోటూరిజం మనకు అతిపెద్ద వనరు. జనవరి నుంచి వేస్ట్ అనేది ఎక్కడా కనిపించకూడదు. 83 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేసాం . చెత్తపై పన్ను కూడా తీసేసాం. విద్యార్థులకు ఇచ్చిన గ్రీన్ పాస్ పోర్టు ను ప్రమోట్ చేయండి. పట్టణాల్లో స్వచ్ఛత కోసం తీసుకునే చిన్న చిన్న మార్పులే మంచి ప్రభావం చూపిస్తాయని అన్నారు.




## ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై నెపం నెట్టేస్తోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని చెప్పే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు.. చేరామని చెప్పే దమ్ము ఆ ఎమ్మెల్యేలకు లేదు. ఆ స్థానాల్లో వచ్చే ఉపఎన్నికల్లో భారాస అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి. రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు మొదలుకొని.. అసెంబ్లీ ఎన్నికల వరకూ అన్నింటిలోనూ భారాసదే విజయం. గత దీపావళికి బాంబులు పేలతాయని మంత్రి పొంగులేటి అన్నారు. మళ్లీ దీపావళి వస్తోంది కానీ ఏమీ లేదు. ఈసారి పాలేరులో ఆయన ఎలా గెలుస్తారో చూద్దాం’ అని కేటీఆర్ పేర్కొన్నారు.



## కోలుకుంటున్న ఓజోన్ పొర.. శుభవార్త చెప్పిన ఐక్యరాజ్యసమితి

న్యూయార్క్ సెప్టెంబర్ 16: ఐక్యరాజ్యసమితి శుభవార్త చెప్పింది. భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర కోలుకుంటున్నట్లు వెల్లడించింది. రానున్న దశాబ్ధాల్లో ఆ ఓజోన్ రంధ్రం పూర్తిగా మూసుకుపోనున్నట్లు యూఎన్ తన నివేదికలో పేర్కొన్నది. అంతర్జాతీయ దేశాల నిరంతర చర్యల వల్ల ఈ సక్సెస్ సాధ్యమైనట్లు యూఎన్ తెలిపింది. యూఎన్ వరల్డ్ మెటియోరోలాజికల్ ఆర్గనైజేషన్ దీనిపై కొత్త నివేదికను రిలీజ్ చేసింది. అంటార్కిటికాపై ఉన్న ఓజోన్ రంధ్రం గతంతో పోలిస్తే 2024లో చిన్నగా ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రస్ కూడా స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. ఓజోన్ పొర కోలుకుంటోందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన హెచ్చరికలు పనిచేసినట్లు ఆయన తెలిపారు. దీని వల్ల ప్రగతి సాధ్యమవుతోందన్నారు. ఓజోన్ బులెటిన్ 2024ను ప్రపంచ వాతావరణ సంస్థ పబ్లిష్ చేసింది. సహజసిద్ధమైన పరిణామాల వల్ల ఓజోన్ పొర సన్నగిల్లడం నిలిచిపోయినట్లు పేర్కొన్నది. కానీ దీర్ఘకాలంగా ఆలోచిస్తే, అది శాస్త్రవేత్తల ఘనతగా తెలిపారు. క్లోరోఫ్లోరో కార్బన్స్ వినియోగంపై అంతర్జాతీయంగా వత్తిడి తేవడం వల్లే ఓజోన్ పొర బలహీనపడడం ఆగినట్లు చెప్పారు.వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా బులెటిన్ రిలీజ్ చేశారు. వియన్న కన్వెన్షన్ 40వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నారు. ఆ నాటి సదస్సులో ప్రపంచ దేశాలు ఓజోన్ పొర సన్నగిల్లడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 1975లో ఆ కన్వెన్షన్ జరిగింది. ఆ తర్వాత 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్ రిలీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఏరోసోల్ స్ప్రేస్‌లో ఓజోన్ పొరను బలహీనపరిచే పదార్ధాల వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించారు.ప్రస్తుతం ఓజోన్ పొర రికవరీ ట్రాక్‌లో ఉందన్నారు. ఈ శతాబ్ధం మధ్య కాలం వరకు .. 1980 తరహా స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేశారు. దీని వల్ల స్కిన్ క్యాన్సర్లు, క్యాటరాక్టులు తగ్గుతాయన్నారు. అతినీలలోహిత కిరణాల వల్ల జరిగే నష్టాలు నివారించబడుతాయని రిపోర్టులో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29న అంటార్కిటికా వద్ద ఓజోన్ పొర 46.1 మిలియన్ టన్నుల మాస్ డెఫిసిట్‌తో ఉందని, ఇది 1990-2020 దశకంతో పోలిస్తే తక్కువ అని రిపోర్టులో పేర్కొన్నారు.

# సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఈత కొట్టడం కూడా ఇష్టం.భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా ప్రధానమంత్రి ప్రజాదరణ పెరిగింది. ఈ ఏడాది జూలైలో విడుదలైన ఆమోద రేటింగ్ జాబితాలో డెమోక్రటిక్ నాయకుడు అగ్రస్థానంలో నిలిచారు. గత 11 సంవత్సరాలలో ప్రధానమంత్రి మోడీ అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని సగర్వంగా నిలబెట్టారు. నరేంద్ర మోడీ జీవిత కథ.. పోరాటం, అంకితభావం స్ఫూర్తిదాయకమైన గాథ అని చెప్పవచ్చు. ఆయన తన అసాధారణ నాయకత్వం, గొప్ప వ్యక్తిత్వంతో భారతదేశానికి కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం, దార్శనికత ,ప్రజా మద్దతు ఆయనను ప్రభావవంతమైన నాయకుడిగా మార్చాయి. తన నిర్ణయాలకు కట్టుబడి ఉండి.. తన లక్ష్యాలను సాధించడానికి కష్టపడి పనిచేసే బలమైన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం ఆయన్ని మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా నిలబెట్టింది ప్రధానమంత్రి భారతదేశ భవిష్యత్తు గురించి శ్రద్ధ వహించే దార్శనిక నాయకుడు. ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో స్వచ్ఛ భారత్ అభియాన్, డిజిటల్ ఇండియా , మేక్ ఇన్ ఇండియా మొదలైనవి ఉన్నాయి. ఇవి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి సహాయపడుతున్నాడు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ప్రజాదరణ, ఆయన వ్యక్తిత్వ అఖండ ప్రభావం ఆయనను దృఢ సంకల్పం కలిగిన నాయకుడిగా మార్చాయి. కష్టమైన నిర్ణయాలను కూడా



సులభంగా అమలు చేయగల నేర్పరి తనం ఆయన సొంతం. నరేంద్ర మోడీ నాయకత్వ సామర్థ్యం, దార్శనికత .. ప్రజా మద్దతు ఫలితంగానే అని చెప్పవచ్చు. ఆయన తన జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. తన ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాల్ ను ఆయన అధిగమించారు. ఈ లక్షణం మోడీ దృఢ సంకల్పానికి అద్దంగా నిలుస్తుంది. చిన్న వయసులోనే ఇంటిని వదిలి ప్రజా జీవితంలోకి ప్రవేశించిన నరేంద్ర మోడీ తన జీవితాంతం నిస్వార్థంగా దేశ సేవలోనే గడిపారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా అగ్రస్థానంలో ఉన్న మన దేశాన్ని అభివృద్ధి బాటలో పయనించే విధంగా అనేక సంస్కరణలు చేపట్టారు. మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నాయకులు కూడా మోడీ నాయకత్వాన్ని ప్రశంసల వర్షంతో నింపేస్తున్న సంగతి తెలిసిందే.

# స్పీకర్ నిర్ణయంపైనే భవిష్యత్తు..

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (వాయిస్ టుడే): తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు యాంటీ%-%డిఫెక్షన్ చట్టాన్ని, రాజ్యాంగ స్థానాన్ని ప్రశ్నించేలా మలుపు తిప్పుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు %-% ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు దాదంబోయినా నాగేందర్, కడియం శ్రీహరి, తెళ్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలె యాదయ్య, ఎం. సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికేపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, ట్రెజరీ బెంచీల్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వాదన. ఇది యాంటీ%-%డిఫెక్షన్ చట్టానికి (10వ షెడ్యూల్) విరుద్ధమని, డిస్క్వాలిఫికేషన్ పిటిషన్లు 2024 మార్చి%-%ఏప్రిల్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు. సుప్రీం కోర్టు 2025 జూలై 31న జారీ చేసిన ఆదేశాల్లో, స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని డైరెక్ట్ చేసింది. దీంతో 2025, ఆగస్టు 23న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారా లేదా అనే వివరణ కోరారు. ఇది డిఫెక్షన్ కేసుల్లో స్పీకర్ నిర్ణయాలపై రాజ్యాంగపరమైన ప్రశ్నలను లేవనెత్తింది. కోర్టు, స్పీకర్/ఛైర్మన్‌లకు డిఫెక్షన్ నిర్ణయాల బాధ్యతను అప్పగించడం సమర్థవంతమా అని పార్లమెంట్‌ను పరిశీలించమని సూచించింది.స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ, 10 మంది ఎమ్మెల్యేలలో 8 మంది 2025 సెప్టెంబర్ 11 నాటికి వివరణలు సమర్పించారు. వారంతా ఐక్యంగా, ‘మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం, కాంగ్రెస్‌లో చేరలేదు‘ అని పేర్కొన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశాలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సేవల కోసమే అని వాదించారు. కొందరు ‘టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నాం‘ అని, సోషల్ మీడియా హ్యాండిల్స్ మార్చలేదని చెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేలు తమ చట్టపరమైన సలహాలతో స్పందిస్తున్నారు. కొందరు ఢిల్లీలో సుప్రీం కోర్టు న్యాయవాదులను సంప్రదించి, ప్రజల సేవ కోసం అధికార పార్టీలోకి వెళ్లామని, ద్రోహం చేయలేదని వాదిస్తున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వివరణలను తిరస్కరిస్తూ, 2025 సెప్టెంబర్ 13 నాటికి స్పీకర్‌కు కౌంటర్ వాదనలు సమర్పించనుంది.



పార్టీ నేతలు, ‘ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతల సమక్షంలో చేరారు, కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు, కట్టడి బెంచీల్లో కూర్చున్నారు‘ అని ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో డిజిటల్ ఆధారాలు సేకరిస్తున్నారు. దానం నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. కడియం శ్రీహరి కూతురు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చాక దానిని తిరస్కరించి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి గెలిచారు. ఈ ఫిరాయింపుల వివాదం తెలంగాణ రాజకీయాల్లో అస్థిరతను తెలియజేస్తోంది. బీఆర్ఎస్ 2023లో 39 సీట్లతో రెండో స్థానంలో ఉండగా, 10 మంది ఎమ్మెల్యేలు చెరస్తే 29కి తగ్గుతుంది. ఇది పార్టీ బలాన్ని బలహీనపరుస్తుంది. కాంగ్రెస్‌కు (64 సీట్లు) ఇది అదనపు మద్దతు. కానీ డిస్క్వాలిఫికేషన్ అయితే బై%-%ఎలక్షన్లు జరగవచ్చు. అప్పుడు రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉంది. చట్టపరంగా ఫిరాయింపులను నిరోధిస్తుంది. కానీ ఎమ్మెల్యేలు ‘స్వచ్ఛందంగా‘ పార్టీ మారితే పార్టీ విలీనం ద్వారా మినహాయింపు పొందుతారు. బీఆర్ఎస్ ఆధారాలు (వీడియోలు, సమావేశాలు) బలంగా ఉంటే స్పీకర్ డిస్క్వాలిఫికేషన్‌కు ఆమోదం ఇవ్వవచ్చు. స్పీకర్ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపును తీసుకురావొచ్చు.

# కవిత టార్గెట్ యూత్...

వరంగల్ సెప్టెంబరో16, (వాయిస్ టుడే) అవి తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న రోజులు. సాంస్కృతిక ఆయుధంతో కవిత ఉద్యమంలోకి వచ్చారు. నెత్తిన బతుకమ్మను ఎత్తుకొని.. గౌరమ్మను కీర్తిస్తూ.. తెలంగాణ ఉద్యమ ఆవశ్యకతను చాటిచెబుతూ అడుగులు వేశారు. చంటి బిడ్డ తల్లి అయినప్పటికీ ఉద్యమం ముందు వరుసలో నడిచారు. నాడు ఉద్యమం చేస్తున్న రోజులో ఎన్నడూ కూడా యువతను భావోద్వేగానికి గురి కావద్దని చెబుతూ ఉండేవారు కవిత.. చదువులను నిర్లక్ష్యం చేయొద్దని.. ఏనాటికైనా తెలంగాణ వస్తుందని.. తెలంగాణ రాష్ట్రంలోనే సమస్యలు తీరుతాయని స్పష్టంగా చెప్పేవారు.వాస్తవానికి రాజకీయ నాయకులు యువతను తమ స్వార్థం కోసం వాడుకుంటారు. తమ రాజకీయ ప్రాపకం కోసం ఉపయోగించుకుంటారు. కానీ కవిత అలా కాదు. అలాంటి పని కవిత ఎన్నడూ చేయలేదు. అందువల్లే ఆమెను యువత విపరీతంగా ఆరాధిస్తూ ఉంటుంది. ఇటీవల జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమం నిర్వహిస్తే దానికి వేలాదిమందిగా యువత హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో కవిత చెప్పిన మాటలన్నిటినీ శ్రద్ధగా విన్నారు. రాజకీయం మాత్రమే కాదు, నాయకత్వం అంటే ఏమిటో కవిత వివరించిన తీరుకు యువత ఫిదా అయ్యారు. రాజకీయాలు అంటేనే విరక్తి కలుగుతూ.. రాజకీయ నాయకులు అంటేనే హేయమైన భావం విస్తరించిన నేటి రోజుల్లో కవిత మాటలను యువత శ్రద్ధగా వినడం నిజంగా ఆశ్చర్యకరమే. అయితే ఆ మాటల్లో రాజకీయాల్లోకి రావాలని గాని.. ఒకరి మీద పెత్తనం సాగించాలని కానీ కవిత చెప్పలేదు. జస్ట్ సమాజం కోసం ఎంతవరకు అయితే అంతవరకు చేయడమే మనిషి నైజం అని కవిత చెప్పిన మాటలు యువతను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అందువల్లే కవిత నేడు తన పూర్వ రాజకీయ క్షేత్రం నుంచి బయటికి వచ్చినప్పటికీ కూడా ఇంతమంది ఆమెను ఆరాధిస్తున్నారు.ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజుబకాయిలు విపరీతంగా పెరిగిపోయాయి. అటు స్థానిక సమస్య కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. ఇవే విషయాలను కవితంగా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్నారు.. తన సామాజిక మాధ్యమాల వేదికగానే ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్నారు. ముఖ్యంగా ఏపీలో కలిసిన ఆ ఏడు మండలాల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో కవిత అనేక సందర్భాల్లో చెప్పారు. ఇటీవల భద్రాచలంలో పర్యటించినప్పుడు కూడా ఆ ఏడు మండలాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే దానికోసం తాను ఉద్యమం చేస్తానని కూడా ప్రకటించారు.ఇక ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలోనూ కవిత తగ్గడం లేదు. తను శాసనమండలి సభ్యురాలుగా ఉన్నప్పుడు.. అనేక పర్యాయాలు విద్యార్థుల ఫీజు కష్టాల గురించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని.. ఎందుకంటే విద్యార్థులు చదువులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆమె శాసనమండలిలో వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఇటీవల కాలంలో విద్యార్థుల సమస్యల గురించి ఈ స్థాయిలో అటు అధికార పక్షంగాని.. ఇటు ప్రతిపక్షం గాని మాట్లాడలేదు. పైగా రాజకీయంగా వాడుకోవడానికి అవకాశం వచ్చినప్పటికీ కూడా కవిత కేవలం విద్యార్థుల భవిష్యత్తు గురించి మాత్రమే మాట్లాడారు. వాస్తవానికి



రాజకీయ నాయకులు ఎంత మంది అయినా ఉండవచ్చు. వారి రాజకీయాల కోసం ఏమైనా చేస్తూ ఉండవచ్చు. కానీ ప్రజల బాగు కోసం పనిచేసేవారు కొంతమంది మాత్రమే ఉంటారు. ఆ జాబితాలో కవిత ముందు వరుసలో ఉంటారు. తదుపరి రాజకీయ క్షేత్రం ఎలా నిర్మించుకుంటారు.. ఎలాంటి రాజకీయాలను ఎంచుకుంటారు.. అనే విషయాలను పక్కన పెడితే ఇప్పటివరకు అయితే యువత విషయంలో తిరుగులేని ఉద్యమాన్ని చేస్తున్నారు కవిత. భవిష్యత్తు కాలంలో ఆ యువతే కవితకు అండా దండా..

# ప్రజలకు మరింత చేరువలో పాస్‌పోర్టు సేవలు

## రాయదుర్గంలో అత్యాధునిక సదుపాయాలతో సరికొత్త పాస్‌పోర్టు సేవా కేంద్రం



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాస్ పోర్ట్ సేవా కేంద్రంను ఐటీ %డ% పరిశ్రమల, వాణిజ్యం, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్,ఎమ్మెల్సీ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ కే జై శ్రీనివాస జాయింట్ సెక్రటరీ ,సిపిఓ,రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ ఐఎఫ్ఎస్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ అన్ని హంగులతో సకల సౌకర్యాలతో పాస్‌పోర్టు సేవా కేంద్రం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని శేరిలింగంపల్లి ప్రజలకు పాస్‌పోర్టుకు సంబంధిత సేవలు మరింత చేరువలో, వేగవంతంగా అందుబాటులోకి వస్తాయని, ఈ చక్కటి అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.

మంత్రివర్యులు శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పాస్‌పోర్ట్ అనేది భారతీయుల అంతర్జాతీయ గుర్తింపు పత్రం అని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఏర్పడే ముందే యువత పాస్‌పోర్ట్ తీసుకోవాలని సూచించారు. కొత్త భవనంలో రోజుకు 1000 స్లాట్లు అందుబాటులో ఉండడం వల్ల సేవల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం శేరిలింగంపల్లి ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు, అత్యవసర అవసరాల సమయంలో వేగవంతమైన సేవలు అందించేలా రూపుదిద్దుకుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 11 ఏళ్లలో పాస్‌పోర్టు సేవలను దేశ ప్రజలకు చేరువ చేయడానికి అనేక సంస్కరణలు చేపట్టారు. 2014లో దేశవ్యాప్తంగా 110 పాస్‌పోర్టు సేవా కేంద్రాలుండగా, నేడు ఆ సంఖ్య 550కు పైగా పెరగడం ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగించిందని, పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను సులభతరం చేసి వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు టోలీచౌకీ షేక్‌పేట్‌లోని ఆనంద్ సిలికాన్ చిప్ భవనంలో కొనసాగుతున్న పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఇప్పుడు రాయదుర్గం సిరి బిల్డింగ్‌లోకి మార్చారు. అత్యాధునిక సదుపాయాలతో మంగళవారం ప్రారంభమైన ఈ కేంద్రం ఇకపై పూర్తిస్థాయిలో ప్రజలకు అన్ని సేవలను అందిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

### కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ లో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మంగళవారం స్థానికవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రోడ్డు వెడల్పు పనులకు ఇబ్బందిగా ఉన్న ఇంటి ఆరు బయట ర్యాంప్‌లు తొలగించే విషయంలో అధికారులకు, కాంట్రాక్టర్లకు సహకరించాలని స్థానికులకు సూచించారు.



## కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని ఆత్మీయంగా స్వాగతించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా భాగ్యనగరానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని బేగంపేట్ విమానాశ్రయంలో ఆత్మీయంగా స్వాగతించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు. ఈ సందర్బంగా ఇటీవల ఎద్దుమైలారం లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ?1119 కోట్ల విలువైన డిఫెన్స్ ఆర్డర్ మంజూరు చేసినందుకు మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ ప్రజలకు ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతున్న ఈ సందర్భంలో, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రత్యక్షంగా సందర్శించాలని కేంద్ర రక్షణ మంత్రిని కోరిన ఎంపీ రఘునందన్ రావు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బహుల అంతస్తుల సముదాయకు రాకపోకలు సాగించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం గ్రీన్ హిల్స్ రోడ్డులో గల బహుల అంతస్తుల సముదాయలైన రెయిన్బో విష్టాస్ రాక్ గార్డెన్, మెరినా స్కై, రేయిన్బో విష్టా పేస్ 1 సంఘాలు సంయుక్తంగా మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి డివిజన్ పరిధిలోని తమ ప్రదాన సమస్య గ్రీన్ హిల్స్ రోడ్డు మార్గంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో దాదాపు 15 వేల మంది నివసిస్తున్న ఈ సముదాయాల నుండి ఇందులో ఉపాదికోసం రోజు వచ్చే 3వేల మందికిపైగా మహిళలు నిత్యం వేల సంఖ్య లో రోడ్డు కు అటువైపు వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రానున్న కాలంలో కొత్తగా రాబోయే సముదాయల ద్వారా వేల సంఖ్యలో నివాసాలు రాబోతున్న తరుణంలో పాదచారులకు ప్రదాన సమస్యకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేయించి రంగదాముని మార్గం నుండి మాదాపూర్ కు ఫ్లై ఓవర్ నిర్మాణానికి కూడా ప్రయత్నంచేసి శాశ్వత పరిష్కారం చూపమని బండి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మూడు సముదాయాల సంఘాల సభ్యులు టి.సత్యనారాయణరెడ్డి, ఓంకార్ రెడ్డి, రామారావు, రామ్ తిలక్, సుమంత్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మాధవరం కృష్ణారావు సానుకూలంగా స్పందించి తక్షణమే సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు.




## మా భవిష్యత్తు ఏమిటి..! (పిల్లల) స్థానికత ఎక్కడ...!

### స్థానికత కోల్పోతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.....

### జీవో కు ముందు అవకాశం ఉన్నా లోకల్ తిరస్కరణ...

### మెడికల్ కౌన్సిలింగ్లో అవకాశం కల్పించాలి....

సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రభుత్వం 2024 జూలై నెలలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 వల్ల 2024 వరకు చదువు పూర్తి చేసి, మంచి ర్యాంకులు సాధించిన పిల్లలు (విద్యార్థుల) స్థానికత పేరుతో తీవ్రంగా నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారిందని, నాన్ లోకల్ కింద పరిగనింపబడి నష్టపోతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిలింగ్ 2025 లో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం ఇందిరాపార్క్ వద్దగల ధర్నా చౌక్ లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు జాకీర్ అహ్మద్, నవీన్ కుమార్, లక్ష్మీ, విగ్నేశ్వర రావు, అశోక్ లు మాట్లాడుతూ... ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 33 ను పూర్తిగా సమర్థిస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలలో ఏదైనా జీవో జారీ అయినప్పటి నుండే నిబంధనలు అవుతాయని, కానీ కొంతమంది ఉన్నతాధికారుల బాధ్యత రాహిత్యం వల్ల వెసులుబాటు ఉన్నా సరే బంగారు భవిష్యత్తు కలిగిన విద్యార్థులను వైద్య విద్యకు నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 33 ను 2024 లో ప్రభుత్వం జారీ చేసిందని, జీవో జారీ చేయబడిన తేదీ కంటే ముందే పక్క రాష్ట్రాల్లో చదువు పూర్తి చేశారని, పిల్లలు కేవలం రెండు సంవత్సరాలు పక్క రాష్ట్రంలో విద్యను అభ్యసించినంత మాత్రాన నాన్ లోకల్ గా పరిగణించడం భావ్యం కాదని, అలా పరిగణించడం వల్ల 2025 నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన 50 మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని లోకల్ క్రింద పరిగణించాలని, మెడికల్ కౌన్సిలింగ్ లో పాల్గొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మా పిల్లలందరూ స్థానికులు కానప్పుడు ఎలక్షన్లలో మావి, మా పిల్లల ఓట్లు ఎలా పరిగణిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వారి స్థానికత ఎక్కడో, వారి భవిష్యత్తు ప్రభుత్వమే నిర్ణయించాలన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాల విద్యార్థులు తల్లిదండ్రులు దగ్గరగా ఉన్న మంచి కాలేజీలో పిల్లలని చేర్పించాలని కోరుకుంటారని, మేము అలాగే చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన జరిగినప్పుడు 10 సంవత్సరాల ఏ రాష్ట్రంలో చదివినా వారి స్థానికత కోటకు అర్హులేనని ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు. కాబట్టి తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని నీట్ కౌన్సిలింగ్ విషయంలో లోకల్, నాన్లోకల్ సమస్యపై సడలింపు ఇచ్చి నష్టపోతున్న విద్యార్థులను ఆదుకోని కౌన్సిలింగ్లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ప్రసిద్ధ ఒంటిమిట్ట రామాలయ దేవాలయాన్ని ప్రతేక పూజలు నిర్వహించిన టీడీపీ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఉప్పు రామకృష్ణ

కూకట్ పల్లి, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో గల ప్రసిద్ధ ఒంటిమిట్ట రామాలయ దేవాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్ ప్రాంతానికి చెందిన టీడీపీ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఉప్పు రామకృష్ణ, నర్సింహా, బొమ్మ అశోక్. యాదయ్య, ఈ.అశోక్ జి శ్రీనివాస్ తదితరులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం అర్చకులచే ఆశీర్వదాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## వెంకటేశ్వర కాలనీలో విస్తృతంగా పర్యటించిన రజిత పరమేశ్వర్ రెడ్డి

### అభివృద్ధి పనులతో కాలనీలలో సమస్యల పరిష్కారం

### ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):– అభివృద్ధి పనులతో ఉప్పల్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తున్నట్టుగా ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు. మంగళవారం ఉప్పల్ డివిజన్లోని వెంకటేశ్వర కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కాలనీ లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న రజిత పరమేశ్వర్ రెడ్డిలు ఉన్నారు. వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి కాలనీలో ఎదుర్కొంటున్నా ప్రధాన సమస్యలు తీసుకువచ్చారు. కాలనీలోఅండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణం పనులు రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. అతిత్వరలో వెంకటేశ్వర కాలనీలో మిగిలిన సీసీ రోడ్లు నిర్మాణం పనులను పూర్తి చేస్తామని రజిత పరమేశ్వర్ రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ అధికారి సత్యనారాయణ ,వెంకటేశ్వర కాలనీ ఆధ్యక్షులు ఏసోజు నరసింహ చారి,బాకారం లక్ష్మణ్ గారు,సల్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, చంద్రశేఖర్, అన్నపురెడ్డి అపూర్ణ,సోమయ్య, పేరయ్య, రవీందర్, శ్రీనివాసరావు, బాబీ,ముకుంద, కే వెంకటేష్ గౌడ్, స్వామి,వెంకటేష్ యాదవ్, వెంకటరమణ రెడ్డి,ఆర్ సురేష్, పాల్గొన్నారు.

## త్వరలో జనశక్తి మద్దూర్ సభ రాంవిలాస్ బెస్ట్ కాంట్రాక్టు అవార్డులు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ వేతనాలతో కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నప్పటికిని, అందులో అత్యుత్తమ సేవలు చేసే కాంటాక్ట్ కార్మికులకు, అత్యుత్తమ సేవలు అందించే కాంట్రాక్టు లకు ప్రతిభ గల వారికి జనశక్తి మద్దూరు సభ రామ్ విలాస్ అవార్డులు అందజేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర జన శక్తి (రామ్ విలాస్)లేబర్ సెల్ జనశక్తి మజ్దూర్ సభ అధ్యక్షులు సురేందర్ తెలిపారు. మంగళవారం భెల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేతనాలు ఇచ్చి మంచి సేవలు చేసిన స్రవంతి కన్స్ట్రక్షన్స్ రాములు కు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికులను ప్రతి ఒక్కరు ఆదరించి అభిమానించి తగిన వేతనాలు ఇస్తూ మతి సేవలు చేయాలని త్వరలో జనశక్తి మద్దూర్ సభ రామ్ విలాస్ప్రతిభ అవార్డులను అందజేయనున్నట్లు సురేందర్ తెలిపారు.



# గీతంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం

### ఓజోన్ పొరను కాపాడుకుందాం

### అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని రక్షించుకుందాం



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఓజోన్ పొరను కాపాడుకోవడం, అతినీలలోహిత (యూవీ) వికిరణం నుంచి భూగ్రహాన్ని రక్షించుకోవడంపై అవగాహనను పెంపొందించడానికి మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఓజోన్ క్షీణించే పదార్థాలను (ఓడీఎస్) దశలవారీగా తొలగించడం, హానికరమైన అతినీలలోహిత వికిరణం నుంచి భూమిని రక్షించడం లక్ష్యంగా జరిగిన అంతర్జాతీయ ఒప్పందం– మాంట్రియల్ ప్రోటోకాల్ (1987) వార్షికోత్సవాన్ని పున:శ్చరణ చేసుకున్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ రంధి ఉమాదేవి, డాక్టర్ టి.బి. పాత్రుడు సమన్వయంతో, సైన్స్ విద్యార్థులు రుద్రారంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్మ క్యాన్సర్, కంటి రుగ్మతలు, పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదకరమైన యూవీ కిరణాల నుంచి భూమిపై జీవాన్ని రక్షించడంలో ఓజోన్ పొర యొక్క కీలక పాత్రను ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రస్తావించారు.

ఓజోన్ క్షీణించే పదార్థాలను దశలవారీగా తొలగించడం ఓజోన్ పొర పునరుద్ధరణకు మాత్రమే కాకుండా గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను ఎలా తగ్గించిందో, తద్వారా ప్రపంచ వాతావరణ పరిరక్షణకు ఎలా ఉపకరిస్తుందో విద్యార్థులు వివరించారు. ఓజోన్ రక్షణ, వాతావరణ స్థిరత్వం, పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించడం మధ్య సంబంధాన్ని గుర్తించాలని వారు పాఠశాల పిల్లలను ప్రోత్సహించారు. సృజనాత్మకతను ప్రేరేపించడానికి, పాఠశాల విద్యార్థులను పర్యావరణ నేపథ్య చిత్రాలను వేయడానికి ప్రోత్సహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి తమ హృదయపూర్వక మద్దతును అందించడమే గాక, ఆయా కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఓజోన్ క్షీణించే పదార్థాలను తొలగించడం, వాతావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను స్వీకరించడానికి మద్దతివ్వాలనే పిలుపుతో కార్యక్రమం ముగిసింది.



## సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుంది

### సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం సికింద్రాబాద్ లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్, అమీర్ పేట, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాల పరిధిలోని 47 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ క్రింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తులం బంగారం ఇస్తామన్నారు ఎప్పుడు ఇస్తారు అని అధికారులను ప్రశ్నించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడబిడ్డ పెండ్లికి చేయూత అందించాలనే ఉద్దేశం తో కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా నేటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన వివిధ రకాల హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం మరిచారా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే ప్రజలు అడుగుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. యూరియా కోసం రైతులు రోడ్ల పైకి వచ్చారని, కె సి ఆర్ ప్రభుత్వం లో ఈ పరిస్థితులు ఉండేనా అని అన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అని, హామీలు అమలు చేయలేమని ప్రజల వద్దకు వెళ్ళి చెప్పే ధైర్యం ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు కుర్మ హేమలత, టి. మహేశ్వరి, సూచిత్ర, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, తహసీల్దార్ పాండు నాయక్, రెవెన్యూ అధికారులు, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, నరేందర్, లక్ష్మీపతి, నాగులు, మహేష్ యాదవ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17 ముమ్మాటి కి విమోచన దినమే

**ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణకు విముక్తి.....**

**మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ.....**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన సెప్టెంబర్ 17 ముమ్మాటి కి విమోచన దినమేనని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. ఈమేరకు మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాదూరి కరుణ అధ్యక్షతన హైదరాబాద్ సంస్థాన విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని రౌండ్ టేబుల్ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రజల బానిస సంకెళ్లు తెగిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. ఎంతో మంది ఉద్యమకారుల త్యాగాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ మిలిటరీ యాక్షన్ వల్లనే ప్రజల కు విముక్తి లభించిందన్నారు. ఆగస్టు పదిహేనవ తేదీన బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం పాలనలో ఉన్న తెలంగాణలో మన జాతీయ జెండా ఎగురలేదని పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని పటేల్ భారత దేశంలో విలీనం చేసిన రోజునే ఇక్కడి ప్రజలకు విముక్తి దక్కిందని చెప్పారు. విమోచనం కోసం పోరాడిన వారి త్యాగధనుల చరిత్రను నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో మాజీ గవర్నర్ సి హెచ్ విద్యాసాగర్ రావు, విశ్రాంత ఉప కులపతి ప్రొఫెసర్ తిరుపతి రావు, ప్రొఫెసర్ మురళి మనోహర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులభరణం కృష్ణమోహన రావు, బీజేపీ సీనియర్ నేత డాక్టర్ మనోహర్ రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు విట్టల్ రావు ఆర్య, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, కప్పర ప్రసాదరావు, సఫాయి కర్మచారి కమిషన్ మాజీ సభ్యుడు చింతా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## వ్యభిచారం నిర్వహిస్తున్న విటులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వాయిస్ టుడే న్యూస్, సెప్టెంబర్ మేడిపల్లి : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్లో ఉండే స్వప్న బ్యూటీషియన్ గా పనిచేస్తోంది. భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో ఈజీ మనీ కోసం తెలిసినవారు నవీన్, అశోక్ తో కలిసి ఏపీ యువతులను రప్పించి వ్యభిచార గృహం నిర్వహిస్తోందని పోలీసులు గుర్తించి పక్కా సమాచారంతో ఎస్సై నర్సింగ్రావు సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు యువతులు, ఓ విటుడు, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. 3 సెల్ఫోన్లు, రూ.1200 స్వాధీనం చేసుకున్నారు.

# సికింద్రాబాద్‌లో మెడికవర్ ఆసుపత్రి ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలి**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రజలందరికీ ప్రాథమిక వైద్యం నుంచి అత్యాధునిక చికిత్సల వరకు సమానంగా వైద్య సేవలు అందించాలని, ఆ దిశగా మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం పాటుపడాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ సంగీత్ చెరసా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరై ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో, మెడికవర్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ లో తమ 24 వ నూతన ఆస్పత్రిని ప్రారంభించడం చాల అభినందనీయం అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ముల్టీస్పెషాలిటీ ఆస్పత్రి , అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్య బృందం కలిగిన ఈ హాస్పిటల్ రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని అన్నారు. సాధారణ ప్రజల కు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన చికిత్స పొందగలిగే అవకాశం కల్పించడం ఎంతో గొప్ప విషయమని బండి సంజయ్ అన్నారు. మెడికవర్ వైద్యులు సేవా దృక్పథంతో పని చేసి, సమాజంలో విశ్వాసాన్ని పెంచుతారననే నమ్మకం ఉందనీ అన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువలో ఉండే ఆసుపత్రులు మాత్రమే నిజమైన ప్రజాసేవ చేస్తాయనీ, మెడికవర్ ఈ కొత్త భవనం ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి సిద్ధంగా ఉండటం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా చేయాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తుందన్న మంత్రి కేంద్రం సహకారం తీసుకొని ఆరోగ్య తెలంగాణ ను నిర్మిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించే వాటిలో మెడికవర్ లాంటి హాస్పిటల్ లు సేవ దృక్పథంలో కార్యక్రమాలు చేయాలని కోరారు. పేషంట్స్ విషయంలో మీరు మానవీయ కోణం లో అతని భవిష్యత్తు కు సహాయకారి గా ఉండాలని మెడికవర్ యాజమాన్యాన్ని మంత్రి సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి అనిల్ కృష్ణ మాట్లాడుతూ భారత దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ హాస్పిటల్ చైన్ గా ప్రస్తుతం 24 హాస్పిటల్స్ ని మేము ప్రారంభిస్తున్నందుకు సంతోషిస్తున్నాము అన్నారు. రోగి కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ పరంగా అత్యున్నత ప్రమాణాలను అనుసరించే మెడికవర్ హాస్పిటల్స్ అందుబాటు ధరల్లో ఖచ్చితమైన చికిత్సను అందించటంలో దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను నిలుపుకుందన్నారు. అత్యంత నిష్ణాతులైన 40 మందికి పైగా డాక్టర్ల తో పాటుగా ప్రపంచస్థాయి సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి అని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ , సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి. పద్మారావు , కార్పొరేటర్లు కూర్మ హేమలత కొంతం దీపికా, చీర సుచిత్ర శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.



## నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం

### సమావేశంలో పాల్గొన్న ఫిర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్

వాయిస్ టుడే న్యూస్, సెప్టెంబర్ 16 మేడిపల్లి : శ్రీ వీర అంజనేయుల ఆలయ కమిటీ ఛైర్మన్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో, డైరెక్టర్స్ తో కలిసి రాబోయే నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం జరిగింది. మాజీ మేయర్ అమర్ సింగ్ గారు మాట్లాడుతూ, నవరాత్రి పండుగ సత్యం %-% అసత్యం పై గెలుపును సూచిస్తుంది అని, ఈ పండుగను వైభవంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ కి బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం వినతిపత్రం సమర్పించారు. అవసరమైన ప్రదేశాలలో లైటింగ్, సౌండ్, గ్రావెల్ వర్క్స్ మరియు పటాకుల ప్రదర్శన చేయాలని కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందించి, అన్ని ఏర్పాట్లు గ్రాండ్ సెలబ్రేషన్స్ గా చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శివకుమార్, పీఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి, మాజీ కార్పొరేటర్ అనంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు బుచ్చి యాదవ్, మహిళా పీఎంసీ అధ్యక్షురాలు దుర్గ, యువ మండల అధ్యక్షుడు అజయ్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పెట్రోల్ పోసుకొని యువకుడు ఆత్మహత్నం

**పీర్జాదిగూడలో పేదల ఇండ్లపై బుల్డోజర్.**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన బాధితులు.**

**తమ ఇల్లు కూలిస్తే చస్తామంటూ.. పెట్రోల్ పోసుకున్న యువకుడు.**

**అధికార పార్టీ నాయకులు 3 లక్షలు డిమాండ్ చేస్తున్నారని బాధితుల అరోపన.**



వాయిస్ టుడే న్యూస్, సెప్టెంబర్ 16 మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ సర్వే నెం 199 వీకర్ సెక్షన్ కాలనీ లో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన పేదల ఇండ్ల కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీసింది. గత 25 ఏండ్ల గా ఇక్కడే నివాసం ఉంటున్నామని మాకు ఈ చిన్నపాటి రేకుల ఇల్లే జీవనాధారం,ఆటో నడిపించుకుంటూ, కూలి పని చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. మా ఇంటిని కూల్చొదంటూ బాధితురాలు ఐశ్రత్ బేగం,మొహమ్మద్ గౌస్ ల కుమారుడు షానవాజ్ పెట్రోల్ పోసుకొని..చస్తామంటూ.. హెచ్చరించారు.

స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేశ్, కరీం లు మావద్ద రూ. 3లక్షలు డిమాండ్ చేశారని మాకు అంత స్తోమత లేదని కాళ్ళు పట్టుకున్న కనికరించలేదని బాధితులు ఆరోపించారు. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో మాపై కుట్రపూరీతంగా తప్పుడు సమాచారం ఇచ్చి మేడిపల్లి మండల రెవిన్యూ అధికారులను ఉసిగొల్పి నిల్వ నీడ లేకుండా చేయడం దుర్మార్గంమని వాపోయారు. పేదవారిపైనే మీ ప్రతాపమా అంటూ తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం ప్రభుత్వం మరిచిపోయింది

**టీజేఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ**

**అండగా ఉంటామని చెప్పడం తప్ప ఎక్కడ అండగా ఉన్నారో చూపించండి....**

**అవార్డులు కాదు సమయానికి ఆర్థికంగా ఆదుకోండి చాలు...**

**ఆసుపత్రి పాలైన జర్నలిస్టులకు ఆసుపత్రి బిల్లు మొత్తం చెల్లించారా....**

**ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా జర్నలిస్టులకు అందని మొత్తం సహాయం....**

**జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి ఆదుకొనే దిక్కేలేదు....**

**2సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ ఇవ్వలేదు, ఏంప్యానల్ చేయలేదు.....**

**జర్నలిస్టులపై దాడులు చేసిన పట్టించుకోని పోలీసుల, ప్రజాప్రతినిధులు...**

**జర్నలిస్టుల పై దాడి చేసిన వాళ్ళని రక్షిస్తున్న పోలీసులు, తిరిగి జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెడుతున్నా వైనం...**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): జర్నలిస్టుల సమస్యలను తీర్చడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ పేర్కొన్నారు. సమాచార శాఖామంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. చిన్న పత్రికలు ఏంప్యానల్ మెంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం నుంచి వేచి చూస్తున్నాయని మరి వాటిని ఎందుకు ఎంప్యానెల్ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ పాలన విధానాలనే రేవంత్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని అందులో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో అక్రిడేషన్ కార్డుల జారీలో భారీగా అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు కూడా సరిపోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసి తిరిగి వాళ్లపైన తప్పుడు కేసులు పెడుతుంటే పోలీసులు దాడి చేసిన వాళ్లకే సహాయం అందిస్తూ రిపోర్టర్లను శత్రువులుగా చూస్తున్నారన్నారు. జీతభత్యాలు దేవుడెరుగు అది వచ్చింది లేదు పోయేది లేదు దానికోసం కాలక్షేపం తప్ప జర్నలిస్టులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడంలో కేసీఆర్ సర్కారును మరిపిస్తున్నారని అదే కాకుండా ప్రభుత్వ అధికారుల అవినీతిని వెలికితీస్తున్న జర్నలిస్టులను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికారుల అవినీతిని, నిర్లక్ష్యాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని బయటకి తీయడం వల్లనే ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ విధానాలు ప్రజలలోకి వెళతాయని ఈ చిన్నపాటి విషయాన్ని కూడా ఎమ్మెల్యేల నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు మరిచిపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పదేపదే అనడం తప్ప వాళ్ల కోసం చేసింది శూన్యమన్నారు. మాటలు ఎన్నైనా చెప్పవచ్చని వాటిని అమలుపరచడం చేసినప్పుడే చెప్పిన మాటలకు సార్థకత ఉంటుందన్నారు. జీవో ల ప్రకారం ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్ల కార్డులు ఇస్తే అదే అవార్డులు ఇచ్చినంత గొప్ప అని ఇక అవార్డులు ఇచ్చిన జర్నలిస్టులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తిస్థాయిలో బిల్లు చెల్లిస్తే అదే వాళ్లకు పెద్ద అవార్డు అని వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని తెలిపారు. అనారోగ్యాల పాలవుతున్న జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తి మొత్తం చెల్లించి సంక్షేమం కోసం పాటు పడతామని చెబితే బాగుంటుందని ఈ సందర్భంగా సమాచారం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి కి గౌటి రామకృష్ణ సూచించారు. ఇప్పటికైన రేవంత్ సర్కార్ స్పందించి జర్నలిస్టులపై మాటిమాటికి ప్రకటన చేయడం కాకుండా వాటిని అమలు చేయడం చేస్తే బాగుంటుందని కోరారు.

# అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీ స్త్రీ, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

## - యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో (వాయిస్ టుడే ప్రతినిధి):– అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీ స్త్రీ, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్... ప్రతి రోజు అంగన్వాడీ కేంద్రంలో ఎంత మంది పిల్లలు వస్తున్నారని,బాలింతలు, గర్భిణిలు స్త్రీలు ఎంతమంది వస్తున్నారని రిజిస్టర్ చెక్ చేశారు.రోజు పిల్లలు , గర్భిణులు, బాలింతలు వస్తున్నారా, వాళ్ళకి రోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, పాలు గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. గర్భిణి తో ఉన్న మహిళ తో కలెక్టర్ ఫోన్ లో మాట్లాడారు, అంగన్వాడి కేంద్రంలో రోజు భోజనం పెడుతున్నారా , పాలు ఇస్తున్నారా అని గర్భిణీ మహిళను అడిగి తెలుసుకున్నారు , ప్రతి నెల దవాఖాన కి వెళ్లి చెకప్ లు చేసుకుంటున్నారా, ఆశ వర్కర్లు ప్రతి రోజు మీతో మాట్లాడుతున్నారా అని అడిగారు, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, డెలివరీ కి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాలని సూచించారు.

అనంతరం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన జిల్లా కలెక్టర్.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి ఎన్ని రోజులు అయిందని, ఇంటి నిర్మాణం కోసం మేస్త్రీ కి ఎంత డబ్బులు ఇస్తున్నావ్,ఇటుక కొనుగోలు చేయడానికి ఎంత రేటు కు తీసుకున్నారని లబ్ధిదారురాలిని కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. మేస్త్రి రోజు వారీగా కూలీగా ఇస్తున్నానని, ఇటుకకు 7 రూపాయలు పడిందని, ఇసుక ప్రభుత్వమే ఉచితంగానే ఇస్తున్నదని ఆమె కలెక్టర్ కు తెలిపారు. నిర్మాణం పూర్తయినంత వరకు బిల్లులు వచ్చాయా అని అడిగితే వచ్చాయని ఆమె తెలిపారు.స్లాబ్ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఇంటి ముందు గుంతల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వాటి మీద చేరి డెంగ్యు జ్వరం వచ్చే అవకాశం ఉంటుందని వారం రోజుల కి ఒక్కసారి నీటి గుంతల్ని శుభ్రం చేసుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులే

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.సెప్టెంబర్16 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులే అని సిపిఐ మండల కార్యదర్శి ఎండి ఉస్మాన్ అన్నారు. తెలంగాణ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మెటుపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం అమరవీరులకు సిపిఐ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అమరవీరుల చిత్రపటాలకు ఎండి ఉస్మాన్ తో పాటు మున్సిపల్ కార్మికులు విప్లవ జోహార్లు అర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ... ఆనాడు భూస్వాములకు రజాకారులకు ఎదురుండి పోరాడిన కమ్యూనిస్టుల చరిత్ర ప్రతి ఒక్కరికి తెలుసు అన్నారు. ఆనాటి భూస్వాముల అకృత్యాలకు బలైపోతున్న రైతుల పక్షాన నిలిచి పోరాటాన్ని కమ్యూనిస్టు నాయకులు నడిపారని అన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే సెప్టెంబర్ 17న తెలంగాణ భారత దేశంలో విలీనమైందన్నారు. ఈ నెల 17న తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు బర్ల లక్ష్మణ్ మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు..



## మోడల్ స్కూల్‌లో ఎఫ్.ఎం. రేడియో ప్రారంభం

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో ఉన్న పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ లో ప్రత్యేకమైన ఎఫ్.ఎం. రేడియో కార్యక్రమం ప్రారంభమైంది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులు వినోదభరితంగా, జ్ఞానపూర్వకంగా పాల్గొనేందుకు ఈ రేడియో ప్రారంభించబడింది. ఇందులో విద్యార్థులు వ్యాసాలు, ప్రసంగాలు, సామాజిక ప్రాధాన్యత గల అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడంలో, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఈ రేడియో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య,రమేష్, శ్రీధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడించిన ఏబీవీపీ

### స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్



వాయిస్ టుడే ప్రతినిధిసెప్టెంబర్ 17 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ ఆఫీస్‌ను విద్యార్థులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సిద్ధిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ, రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. బడ్జెట్‌లో నిధులు లేవంటూ నెపం వేస్తున్నప్పటికీ పండుగల సందర్భంగా వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ?8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించకపోతే విద్యార్థులను అడుక్కునే పరిస్థితికి నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై కూడా ప్రభుత్వం మొండి వైఖరినే కొనసాగిస్తే, రాష్ట్రంలోని ప్రతి చోట మంత్రులను, ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని, అవసరమైతే తెలంగాణ ఉద్యమం తరహాలో విద్యార్థుల ఉద్యమం మళ్లీ జోరందుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాకేష్, నగర కార్యదర్శులు చరణ్, పరశురాం, జేశ్వంత్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, విద్యార్థి నాయకులు రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.



## పెయింటర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే) : రామకృష్ణాపూర్ పట్టణ పెయింటర్స్ యూనియన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక సింగరేణి టాగూర్ స్టేడియంలో సమావేశమై కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా బత్తుల మీనయ్య, ఉపాధ్యక్షులుగా బత్తిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ రవి, కోశాధికారి గోరంట్ల వెంకటస్వామి, ఆర్గనైజర్ ఆవుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెయింటర్స్ యూనియన్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య ను ఎన్నుకోవడం జరిగింది.

# నాగార్జునసాగర్‌లో ఫోటో ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

## ఎక్స్పో ఎగ్జిబిషన్ ఫోటోగ్రాఫర్లకు ఎంతగానో ఉపయోగం

## అధ్యక్షులు దాకి నరసింహ



నాగార్జునసాగర్ సెప్టెంబర్ 16: వాయిస్ టుడే ప్రతినిధి: నాగార్జునసాగర్ పట్టణంలో మంగళవారము ఫోటోగ్రాఫర్స్ ఎక్స్పో ఈనెల,19,20,21,తేది న హైదరాబాదులో నిర్వహించే కార్యక్రమం పోస్టర్లను జిల్లా ఫోటోగ్రాఫర్ల అధ్యక్షులు పసుపులేటి కృష్ణ,భరోసా ఇంచార్జ్ జానయ్య,తో కలిసి పట్టణ అధ్యక్షులు దాకి నరసింహ పోస్టర్ ఆవిష్కరించారు,ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు దాకి నరసింహ ఆధ్వర్యంలో,పైలాన్ కాలనీ ఫోటోగ్రాఫర్స్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు,ఈ సందర్భంగా అధ్యక్షులు దాకి నరసింహ మాట్లాడుతూ ఫోటో ఎక్స్పో కార్యక్రమం ఫోటోగ్రాఫర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని ఫోటోగ్రాఫర్లు ముందుకెళ్లాలని తెలిపారు, ఎక్స్పోలో ఫోటోగ్రాఫర్ కి సంబంధించిన అధునాతన సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంటాయని ఈ మూడు రోజుల ఎక్స్పో కార్యక్రమాన్ని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు,ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లకు ఎక్స్పో ఒక మంచి వరం లాంటిది దీనిని ఫోటోగ్రాఫర్లు, అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజు, స్వతంత్ర బాబు, అనిల్, వెంకటేష్, కోడా అప్పారావు, శంకర్, ధనరాజ్, తాతారావు, ఇమ్మానియేల్, నాగేందర్ బాబు, తదితరులు,ఉన్నారు.



## యాదాద్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.వెంకట్ రెడ్డి రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు భోగ చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ రోజు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి PHOTO TRADE EXPO దిగ్విజయం కావాలని కోరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో Photo Tech అధినేత అభిమన్యు రెడ్డి మధురాష్ట్ర జాయింట్ కలెక్టర్ జంగారెడ్డి ఫౌండర్ సభ్యులు నరేందర్ రెడ్డి యాదగిరిగుట్ట మండలం కర్రే శ్యామ్. కందోజు రవికిరణ్ ఈ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.



## దళిత నాయకుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జ తారకం 9వ వర్ధంతి

రాజన్న సిరిసిల్ల జిల్లా (సెప్టెంబర్ 16) వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల నాయకులు బొజ్జ తారకం 9. వర్ధంతి నిర్వహించారు. మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు మాట్లాడుతూ,అణగారిన ప్రజల ఆశాజ్యోతి, దళిత, పౌర హక్కుల నాయకుడు, ప్రజా న్యాయవాది, రిపబ్లికన్ పార్టీ నాయకుడు, కవి, రచయిత, గొప్ప వక్త బొజ్జా తారకం మన నుంచి భౌతికంగా దూరమై తొమ్మిదేళ్ళు దాటింది. ఇంకా ఆయన స్ఫూర్తి సమాజంలోని పీడిత ప్రజల ప్రేమికులకు, ప్రగతిశీల శక్తులకు బాసటగా నిలుస్తూనే ఉంది. బొజ్జా తారకం 1939 జూన్ 27న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తాలూకా కందికుప్ప గ్రామంలో బొజ్జా అప్పలస్వామి%-%మావుళ్ళమ్మ దంపతులకు కనిష్ఠ పుత్రుడిగా జన్మించారు. "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా ప్రజానీకానిది" అని కవి కాళోజీ అన్నట్లుగా బొజ్జా తారకం విద్యార్థి దశ నుంచి తుదిశ్వాస విడిచే వరకు పీడిత ప్రజల అభివృద్ధి కోసమే పోరాడి ఒక ఉజ్వల చరిత్రను మన కళ్ల ముందు నిలిపారు. అని అన్నారు. అంబేద్కర్ నగర్ మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ జిల్లా నాయకులు కంసాల మల్లేశం, వేములవాడ దళిత సంఘాల నాయకుడు లింబాద్రి, సిరిగిరి నవీన్ పాల్గొన్నారు.



## యూరియా కోసం రైతన్నల రాస్తారోకో

రాజన్న సిరిసిల్ల జిల్లా (సెప్టెంబర్ 16) వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా లోని కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో మంగళవారం రైతులు యూరియా కొరతను నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. ప్రతి సంవత్సరం 100 టన్నుల యూరియా అవసరమని, ఇప్పటివరకు ఒక బస్తా కూడా అందలేదని రైతులు మల్యాల కిషన్ రెడ్డి, జువ్వాజి రాజు గౌడ్, ఆవేదన వ్యక్తం చేశారు. పంట ఎదుగుదలకు యూరియా లేకపోవడం దిగుబడిపై ప్రభావం చూపుతుందని పలువురు రైతులు తెలిపారు. ఈ నిరసనతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్న ప్రముఖ సింగర్



రాజన్న సిరిసిల్ల జిల్లా (సెప్టెంబర్ 16) వాయిస్ టుడే): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రముఖ తెలుగు గాయని వరం మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి ముందు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అందరిని చల్లగా చూడాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో రద్దీగా మారింది.

## రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేసిన జిల్లా నాయకులు




రాజన్న సిరిసిల్ల జిల్లా (సెప్టెంబర్ 16) వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ గారికి, జిల్లాలో అధికారులు సమయానికి సమాచారం ఇవ్వకపోగా అవహేళన చేస్తూ సమాచార హక్కు చట్టం కార్యకర్తలను బెదిరిస్తున్నారు. సమాచారం ను సకాలంలో సమాచార కార్యకర్తకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకల కమలాకర్ గారు, ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభాకర్ గారు, గొల్లపల్లి డేవిడ్ గారు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం, 17 సెప్టెంబరు 2025

# విద్యారంగాన్ని పరుగులు పెట్టిస్తున్న ప్రభుత్వంపై బురద జల్లితే ఊరుకునేది లేదు

## యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిన్నబోయిన విద్యాసాగర్



వాయిస్ టుడే ప్రతినిధి సెప్టెంబర్ 17 హుస్నాబాద్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఈరోజు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్నబోయిన విద్యాసాగర్ యాదవ్ మాట్లాడుతూ .. 10 సంవత్సరాల నుండి తెలంగాణలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్లు పట్టించుకున్న పాపను పోలేదు ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే విధంగా చేస్తున్న బిజెపి టిఆర్ఎస్ ప్రభుత్వాలు 10 సంవత్సరాలలో విద్యార్థులకు అసలు గుర్తు రాలేదా ఫీజు రియంబర్స్మెంట్ 10 సంవత్సరాల విద్యార్థులకు మిస్సార్జులు పెంచకుండా ఫీజు రియంబర్స్మెంట్ చేయకుండా ఉన్న కూడా పట్టించుకోని ABVP నాయకులు ఈరోజు మెస్ చార్జీలు పెంచి విద్యార్థులకు స్కూల్ స్టార్ట్ కాకముందే పాఠశాలల్లోకి వాటి పుస్తకాలను అందించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసేసి స్థితి నుండి ప్రభుత్వ పాఠశాలను తెరిపించే స్థాయికి తెచ్చింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలను స్కూల్ డ్రెస్సులను అందించడం జరిగింది మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విద్యపై అవగాహన ఉంది గనుకనే నియోజకవర్గాలలో రెసిడెన్షియల్ స్కూళ్లను ఇంజనీరింగ్ కళాశాలలను ఇవ్వడం జరిగింది కొంతమంది ABVP నాయకులు రాజకీయంగా ఎదగడానికి వారి స్వలాభం కోసం ప్రభుత్వాన్ని బదనాం చేయడం జరిగింది జరుగుతుంది మాది ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కష్టాలు తెలిసిన ప్రభుత్వం మాది ఖబర్దార్ ABVP నాయకుల్లారా ఇంకొకసారి ముఖ్యమంత్రి పై మా మంత్రి పొన్నం ప్రభాకర్ పై మా ప్రభుత్వం పైన గాని అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదే లేదు అని అన్నారు.



# బెల్లం తరలిస్తున్న కారు పట్టివేత

వాయిస్ టుడే ప్రతినిధి సెప్టెంబర్ 17 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తుండగా బెల్లంతో వెళ్తున్న కారు పట్టివేత చేయడం జరిగిందని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడిస్తూ మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ ఆదేశానుసారం..హుస్నాబాద్ స్టేషన్ పరిధిలో, ఎక్సైజ్ ఎస్సై దామోదర్ మరియు టీమ్, సోమవారం రాత్రి నిర్వహించిన రూట్ వాచ్ లో..హుస్నాబాద్ నుండి రామవరం వెళ్ళు దారిలో ఒక టాటా ఇండికా కారు లో తరలిస్తున్న (180) కిలోల బెల్లం మరియు (20) కిలోల పట్టికలను స్వాధీనం చేసుకుని..ముద్దాయి దిడిగం మనోజ్ ను అదుపులోకి తీసుకున్నట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సి ఐ పవన్ తెలిపారు. మనోజ్ గతంలో కూడా గుడుంబా తయారీదారులకు బెల్లం పటిక లు సరఫరా చేసి కేసుల్లో పట్టుపడి, బైండోవర్ కూడా ఉల్లంఘించినాడనీ, మరల ఈ కేసులో పట్టుకున్నామని సి ఐ తెలిపారు. ఈ పట్టివేత లో పాల్గొన్న ఎస్సై దామోదర్, కానిస్టేబుళ్లు ఆరిఫ్, రాజు, సతీష్ మరియు రజిత లను అభినందించారు.

# మద్దెల సుధాకర్ గౌడ్‌కు 'సేవారత్న' పురస్కారం



పెద్దవంగర, సెప్టెంబర్ 17 (వాయిస్ టుడే): హైదరాబాద్ బిర్లా మందిరం భాస్కర ఆడిటోరియంలో ఈ నెల 28న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న కవి సమ్మేళనంలో పెద్దవంగర మండల కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మద్దెల సుధాకర్ గౌడ్‌కు 'సేవారత్న' పురస్కారం ప్రదానం చేయనున్నారు. ప్రజాసేవతో పాటు సాహిత్యరంగంలో విశేష కృషి చేసినందుకు ఆయన ఈ గౌరవానికి ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మంగళవారం మండల కేంద్రంలో సుధాకర్ గౌడ్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రజాసేవ, సాహిత్యరంగాల్లో విశిష్ట కృషికి లభించిన ఈ గుర్తింపు ఎంతో గర్వకారణమని, స్థానికులకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకుముందు మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సీతారాం నాయక్ తల్లి బానోతు నాగమ్మ (80) ఇటీవల మృతిచెందగా, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు పోడిశెట్టి, సైదులు, ముత్తినేని శ్రీనివాస్, సంకేపల్లి రవీందర్ రెడ్డి, బానోత్ శంకర్, కాలేరు కరుణాకర్, దంతాలపల్లి రవి, బండారు వెంకన్న, ఆవుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# గట్టేపల్లి మానేరు వాగులో చిక్కుకున్న కూలీలు, ట్రాక్టర్లు

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్-16 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలో మానేరు వాగులో రోజులాగే పది మంది కూలీలు ఐదు ట్రాక్టర్లు మానేరు వాగులో ఇసుక తీస్తుండగా ఒక్కసారిగా మానేరు ఉధృతి పెరగడంతో పదిమంది కూలీలు ట్రాక్టర్లు చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తాడు సహాయంతో కూలీలను సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్లు బయటకు తీసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచండి

**మంత్రులు ఎమ్మెల్యేల జీతాలు తగ్గించుకోండి.**

**గిరిజన బిడ్డల జీతాలు పెంచండి.**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే సెప్టెంబర్ 16: గిరిజన హాస్టల్ లలో పనిచేస్తున్న కార్మికుల సమ్మెకు గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. గిరిజన హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు,పోస్టుమెట్రిక్, డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్న ఈ సందర్భంలో గిరిజన సంఘం కొత్తగూడెం జిల్లా నాయకత్వం స్థానిక లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల పెద్దతండలోని ఆశ్రమ గిరిజన పాఠశాలను సందర్శించడం జరిగింది, సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలపడం జరిగింది . ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ వాంకుడోత్ అమర్ సింగ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో, గిరిజన హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వేజ్, కార్మికులు తమ శ్రమను వెచ్చించి గిరిజన బిడ్డల కోసం శ్రమిస్తున్నారు, వారి యొక్క జీవన విధానంలో జరుగుతున్న ఖర్చులకు తగ్గట్టుగా వేతనాలు ఉండకపోవడం, వారి జీవన విధానాల్లో,వారి వేతనాలు సరిపోకపోవడం వల్లనే వాళ్ళు న్యాయమైన పోరాటం చేస్తున్నారు, ఈ పోరాటానికి సభ్య సమాజం మద్దతు ఇవ్వాలని కోరడం జరిగినది . ప్రభుత్వం వెంటనే ఈ క్రింది డిమాండ్లను పరిష్కరించాలి. 10 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి జీవో నెంబర్ 64 ప్రకారం పోస్టుమెట్రిక్ హాస్టల్స్ వర్కర్లకు 15,600 వేతనం ఇవ్వాలి, అలాగే జిల్లా కలెక్టర్ గెజిట్ జీవోని డైలీ వేజ్ కార్మికులకు యధావిధిగా అమలు చేయాలి,అదేవిధంగా డైలీ వేజ్ కార్మికులకు యూనిఫాం, పిఎఫ్,ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. వారిని కూడా సమాజంలో ఒక సభ్యులుగా చూసే విధంగా శ్రమ దోపిడీ నుండి విముక్తి చేయాలి అని గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నది.వెంటనే ఈ సమస్యలు పరిష్కారం కానీ ఎడల వారి యొక్క సమ్మెకు, అలాగే వారు చేసే ప్రత్యక్ష పోరాటంలో గిరిజన సంఘం భాగస్వామి అవుతుందని తెలియపరచడం జరిగినది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు లకావత్ కుమార్, నునావత్ విజయకుమార్, లావుడియా రామకోటి, సురేష్ రాము పాల్గొన్నారు.



# వర్ధంతి సందర్భంగా రోజులకు పండ్లు బ్రెడ్ పంపిణీ

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్-16 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణానికి చెందిన క్రీ"శే" కుడిది గట్టయ్య సత్తెమ్మ ల పదిహేనవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సుల్తానాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్స్ పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ బిజెపి ప్రధాన కార్యదర్శి కందునూరి కుమార్ పటేల్, కుమారులు కు, కుడిది రాజేష్, కుడిది సంతోష్ కుడిది శ్రవణ్ పలువురు ఉన్నారు..




# కరాటే పోటీల్లో ఐపీఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్16 (వాయిస్ టుడే): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారు. ఈనెల 14న కరీంనగర్ లో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు స్పారింగ్,కట విభాగంలో సాయి మణిదీప్,ఎస్ సృజన్ బంగారు పథకాలు సాధించగా కట, స్పారింగ్ విభాగంలో తరుణ్, అభిరామ్, శ్రీతన్ రజత పథకాలు సాధించారు. కటా విభాగంలో మైత్ర వరుణ్ కాంస్య పథకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కనకేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు కళలలో కూడా రాణించాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే సెప్టెంబర్ 16: విద్యార్థులు చదువుతోపాటు కళలలో కూడా రాణించాలని జిల్లా కలెక్టర్ జితేష్ మీ పటేల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు జరగనున్న జిల్లా స్థాయి కళా ఉత్సవం పోటీలను ప్రారంభించిన ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ చిన్నప్పుడు తనకు కూడా కళల పట్ల ఆసక్తి ఉండేదని, చిన్నతనంలో సంగీత ఉపాధ్యాయురాలు అంటే తనకు ఎంతో ఇష్టమని, కానీ వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేక పోయానని, కానీ నేటి విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటేనే భవిష్యత్తు ఆకర్షణీయంగా ఉంటుందని సూచించారు. పిల్లలందరూ తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడానికి దారి చూపించే ఒక మార్గమే ఇటువంటి పోటీలను పిల్లలకు ఉద్బోధించారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొని తీపి జ్ఞాపకాలను తమతో తీసుకువెళ్లాలని సూచించారు. ఈ పోటీలలో సుమారు రెండు వందల మంది పిల్లలు 12 రకాలైన కళారూపాలను రెండు రోజులపాటు ప్రదర్శించనున్నారని, అందులో భాగంగా మొదటి రోజు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, థియేటర్ ఆర్ట్, విజువల్ ఆర్ట్స్ 2డీ 3డీ అంశాలలో పోటీలు నిర్వహించనున్నామని, రెండవ రోజు గాత్ర సంగీతం, వాద్య సంగీతం, కథలు చెప్పటం అంశాలలో పోటీలను నిర్వహించనున్నామని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజు శేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులు, వివిధ పాఠశాల నుండి వచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మొదటిరోజు విజేతల వివరాలు:**

థియేటర్ ఆర్ట్స్:
ప్రథమ బహుమతి: నవభారత్ పబ్లిక్ స్కూల్ పాల్వంచ, ద్వితీయ బహుమతి: పీఎం జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల పాల్వంచ.

విజువల్ ఆర్ట్స్ -2డి
ప్రథమ: వి. అంశీత, నవభారత పబ్లిక్ స్కూల్, పాల్వంచ
ద్వితీయ: ఎన్ నిశిత సాయి, బిపిఎల్ స్కూల్ బూర్గంపహాడ్

శాస్త్రీయ నృత్యం:
ప్రథమ: ఎం. ధవళ, త్రివేణి స్కూల్, లక్ష్మీదేవిపల్లి
ద్వితీయ: పి ఖ్యాతి క్రిపిత, కృష్ణవేణి జూనియర్ కాలేజీ, కొత్తగూడెం.

వీరికి జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి బహుమతులు అందజేశారు.

# పి.డి.ఎస్.యూ జిల్లా3వ మహాసభ సందర్భంగా విద్యార్థి భారీ ప్రదర్శన బహిరంగ సభ

**కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యాని నీరుకారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.**

**అందరికీ విద్య కొరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలి.**

**వక్త నున్న అప్పారావు పి.డి.ఎస్.యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు.**




బుధవారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) జిల్లా 3వ మహాసభ సందర్భంగా ఈరోజు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించి హాల్ నందు బహిరంగ సభను నిర్వహించడం జరిగింది. ఈ సభలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు పాల్గొని మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలను పూర్తి చేసుకున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఉమ్మడి తెలుగు నేలపై చరిత్రలో నిలిచిపోయే విధంగా విద్యార్థుల పక్షాన నిలుస్తూ అసామాన్య త్యాగాలతో రాజీలేని పోరాటాలను నిర్వహించిందని, కా..జార్జిరెడ్డి మొదలు ఎందరో విద్యార్థులు తమ నిండు ప్రాణాలు తృణప్రాయం అర్పించి విద్యార్థి ఉద్యమానికి ఎంతో ఊతమిచ్చారని విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకై విద్యార్థులు మరింత ఉధృతమైన ఉద్యమాలను నిర్వహించాలని, అందరికీ ఉచితంగా, సమాన విద్యను అందించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపార సరుకుగా మార్చిన కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయి. ఉన్నాయి పేద విద్యార్థికి విద్య అందని ద్రాక్షగా మారింది. విద్యారంగాన్ని తమకు అనుగుణంగా మలుచుకుంటూ బూర్జువా పాలకవర్గాలు సమాజంలో విద్య యొక్క అసలు లక్ష్యాన్ని నుండి తప్పిస్తున్నారు. దేశ అభివృద్ధి పట్ల, ప్రజల పరిస్థితుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేని పాలకులు సామ్రాజ్యవాద విష సంస్కృతిని పెంచి పోషిస్తూ విద్యార్థులను, యువతను పెడదోరనలు పట్టేలా చేస్తున్నారు. విద్యార్థులను ప్రశ్నించే తత్వం నుండి తప్పిస్తూ నేటి విద్యార్థి శక్తిని నిర్వీర్యం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు మరింత ముందుకు రావాలని నూతన ప్రజాస్వామిక విలువల కోసం, శాస్త్రీయ విద్యా సాధనకై, విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకై విద్యార్థి లోకం మరింత ఉధృతంగా ఉద్యమాలను నిర్వహించాలని వారు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ సభలో పి.డి.ఎస్.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సాంబ, సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కందగట్ల సురేందర్, ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు వీరమల్ల ఉమ, మల్లూరి సుగుణ, పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే గణేష్ లు ప్రసంగించారు. పి.డి.ఎస్.యూ జిల్లా నాయకులు డి అరుణ్, పల్లవి, సందీప్, సంతోష్, రాజేష్, జీవన్, మౌనిక, భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ




**- ప్రతి వ్యక్తికి సమాచారం తెలుసుకునే హక్కు ఉంది**

**- ఆర్టిఐ-2005 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి**

**- ప్రజా సమాచార అధికారికి ఆర్టిఐపై సంపూర్ణ అవగాహన కల్గి ఉండాలి**

**- రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే) జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) 2005 ను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాస రావు, అయోధ్య రెడ్డి, మొహసిన పర్వీన్ లతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం గత కొన్ని రోజులుగా నిర్లిప్తత ఏర్పడినట్లు భావం అందరిలో వచ్చిందని, 2 సంవత్సరాల పాటు ఆర్టిఐ కమిషనర్ నియామకం కాకపోవడంతో 17 వేల కేసులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా డిస్పోస్ చేయడంతో పాటు అధికారులలో ఉన్న నిర్లక్ష్యం తొలగించాలనే ఉద్దేశంతో జిల్లాల పర్యటన చేపట్టామని అన్నారు. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం మొదలగు జిల్లాలో ఇప్పటి వరకు పర్యటించామని అన్నారు. ఆర్టిఐ చట్టం పై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారటీ, రెండవ అప్పిలేట్ అథారటీ పేర్లు, ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు.

2005 పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ తో పాటు సెక్షన్ 4 (1) (బి) వివరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, అటువంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకుని వస్తున్నామని అన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం ప్రకారం అవగాహనతో అమలు చేస్తే అక్రమాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రజలు సమాచారం అధికంగా తెలుసుకోవడం వల్ల జరిగే మోసాల నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. సమాజంలో వాచ్ డాగ్ లాగా సమాచార హక్కు చట్టం పని చేస్తుందని తెలిపారు . జిల్లా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, 2005 లో వచ్చిన సమాచార హక్కు చట్టం కారణంగా ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారితనం పెరిగిందని అన్నారు. మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ప్రతి కార్యాలయం కు వచ్చే ఆర్టిఐ దరఖాస్తుకు సకాలంలో సమాధానం అందించేలా అధికారులకు ఆదేశాలు అందించామని అన్నారు.

ఆర్టిఐ చట్టం పై అధికారులందరికి సమగ్రమైన అవగాహన కల్పించి పటిష్టంగా అమలు జరగాలని లక్ష్యంగా ఆర్టిఐ కమిషన్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ప్రతి అధికారి తన హక్కులు , బాధ్యతలు చట్టపరంగా పాటించాల్సిన మార్గదర్శకాలను తెలుసుకొని సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆర్టిఐ చట్టాన్ని నిజమైన స్పూర్తితో పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఆర్టిఐ కమిషనర్లు అందించిన సూచనలు సలహాలను సిరిసిల్ల జిల్లా లోని ప్రజా సమాచార అధికారులు తూచా తప్పకుండా పాటించాలని, చిన్నచిన్న కారణాల వల్ల సమాచారం ఇవ్వని కేసులను త్వరగా డిస్పోస్ చేయాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయడం ద్వారా పాలనలో పారదర్శకత ఉంటుందని అన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆర్టిఐ చట్టం ప్రజల్లో తీసుకుని వెళ్ళేందుకు వారదులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలని అన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాచారం అడిగే హక్కు కల్పించిన వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు.

ప్రజా సమాచార అధికారి తప్పుడు సమాచారం అందించినా,ఆలస్యం చేసినా ఆర్టిఐ చట్టం సెక్షన్ 21,22 ప్రకారం ఆర్టిఐ కమిషన్ చర్యలు తీసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆర్టిఐ చట్టం నిబంధనలు తెలుసుకొని ప్రతి అధికారి పాటించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం అమలు లో నిర్లక్ష్యం వహిస్తే అనవసరపు అనుమానాలకు తావు ఉంటుందని అన్నారు. ఆర్టిఐ దరఖాస్తులను సకాలంలో డిస్పోస్ చేయడం ద్వారా ప్రజలలో ఉన్న అనుమానాలు తీరి పోతాయని అన్నారు. మన దగ్గర ఉన్న సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించాలని అన్నారు.మన అధికారులు అనవసరంగా భయాందోళనలకు గురై సమాచారాన్ని దాచి పెట్టాల్సిన అవసరం లేదని అన్నారు. సెక్షన్ 81(%ఐ%) ప్రకారం వ్యక్తిగత సమాచారం మాత్రమే ఇవవద్దని, దీనిని దుర్వినియోగం చేయవద్దని అన్నారు.

ప్రజా సమాచార అధికారులకు ఆర్టిఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం సంబంధించి జిల్లా లో పెండింగ్ ఉన్న 134 కేసులను కమిషన్ సభ్యులు జిల్లా సమీకృత కార్యాలయ భవనంలో పరిశీలించి పరిష్కరించారు. సిరిసిల్ల,వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రిని రెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు,రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పిలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు పోలీస్ అధికారులు సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీసీల రథసారధి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 16: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ రథసారధి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గంలోని మండల, పట్టణ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో డ్యాగల శ్రీనివాస్ ముందుండి కీలక పాత్ర పోషించిన నాయకుడు అని కొనియాడారు. అదే తరహాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో గత 15 సంవత్సరాలుగా నర్సంపేట మండల అధ్యక్షునిగా నియోజకవర్గ నాయకునితో పాటు అంచెలంచెలుగా జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతూ నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ గా నియోజకవర్గంలో నిరంతరం తనదైన శైలిలో బీసీ కులాలను ఏకం చేసే పోరాటంలో భాగంగా బీసీ, బహుజనుల బలోపేతానికి అనునిత్యం కృషి చేస్తున్న డ్యాగల శ్రీనివాస్ కు వరంగల్ జిల్లా తో పాటు నర్సంపేట నియోజకవర్గ ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, జిల్లా నాయకులు మేరుగు శంకర్ లింగం, చెన్నారావుపేట మండల అధ్యక్షులు బర్ల యాకయ్య, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, గుండు బాబ్జీ, కర్రి శివాజీ, నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, నర్సంపేట పట్టణ యూత్ అధ్యక్షుడు గోపగాని నాగరాజు గౌడ్, దుగ్గొండి మండల ఇంచార్జ్ కడారి సురేష్ యాదవ్, దుగ్గొండి మండల నాయకులు మట్ట రమేష్ యాదవ్, చెన్నారావుపేట మండల ప్రధాన కార్యదర్శి చామంతుల రమేష్, చెన్నారావుపేట మండల యూత్ అధ్యక్షుడు బోనగిరి శరత్, శీరంశెట్టి రాజేందర్ పెరక, బొల్లపెల్లి రూత్విక్, మట్ట రమేష్ యాదవ్, సంకటి శ్రీనివాస్ గౌడ్, కొలిపాక సుధాకర్, సాంబయ్య, మోకిడే శ్రీకాంత్, గుండెబోయిన అనిల్ యాదవ్, గాదం అనిల్ యాదవ్, అలువాల చక్రపాణి, వేముల రాజు, బహుజన నాయకుడు ఈసంపెల్లి సురేష్, వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ బిజెపి ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమం

వేములవాడ, సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే) వేములవాడ పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర విభాగం భారీగా వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. సెప్టెంబర్ 17 నుంచి 15 రోజుల పాటు సేవా పక్షం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప్ రామకృష్ణ తెలిపారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ కోరారు. ప్రతి ఒక్కరూ మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలపాలి. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి అని ప్రతాప్ రామకృష్ణ పిలుపునిచ్చారు.పిన్నింటి హనుమన్లు, బిల్ల కృష్ణా, హరి రేగుల రాజకుమార్, గుడిసె మనోజ్, వివేక్ రెడ్డి, జవ్వాజి రాజశేఖర్, కట్కం శ్రీనివాస్, కోలా దన్ను, అన్నం నరసయ్య, నేరెళ్ల సాయి, బుర్ర మనీష్, మెరుగు లక్ష్మి రాజ%శీ%, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సంరక్షణ కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పించాలి

కరీంనగర్, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): మహిళ-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశు సంరక్షణ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్ ) అశ్విని వాకాడే తానాజీ, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ చైర్ పర్సన్ హోదాలో కమిటీ సభ్యుల సహా సంరక్షణ కేంద్రాలలో పిల్లలకు కల్పిస్తున్నటువంటి సౌకర్యాలను అన్నిటిని నిశితంగా పరిశీలించి సూచనలు చేయడం జరిగింది.అవి వెంకట్ ఫౌండేషన్ బాల గోకులం , సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్,మరియు ఓపెన్ షెల్టర్ సంరక్షణ కేంద్రాలను పరిశీలన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిడిపిఓ అర్బన్ శ్రీమతి సబితా కుమారి, డిసిపిఓ పర్వీన్. జిల్లా తనిఖీ కమిటీ సభ్యులు మరియు డిసిపియు సిబ్బంది పి శాంత, తిరుపతి, తేజస్విని, మరియు రమేష్ పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎంపీ వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు

**- సైదాపూర్ క్రాస్ రోడ్‌లో తాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రణవ్.**

**- జయంతి వేడుకలకు భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు.**

హుజురాబాద్ సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): హుజురాబాద్ ప్రాంత బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధికి ముఖ్యంగా త్రాగునీటికి,విద్య పరంగా అనేక సేవలు రాజేశ్వర్ రావు అందజేశారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం నాడు మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ వొడితల(సింగాపురం) రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు హుజురాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సైదాపూర్ క్రాస్ రోడ్ లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతి సందర్భంగా వివిధ మండలాల నుండి వచ్చిన కాంగ్రెస్ నాయకులు,అభిమానులను ఆప్యాయంగా పలకరించారు ప్రణవ్.ఈ సందర్భంగా ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తాత ఆశయాలను కొనసాగిస్తూ,విద్య ఉద్యోగ కల్పనలో మొదటి స్థానంలో ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి**

**జమ్మికుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం**



జమ్మికుంట సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): మంగళ వారం రోజు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల హౌసింగ్ బోర్డ్ కాలనీలో డాక్టర్ మహోన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో 54 మంది కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి వ్యాధి నిర్ధారణకి ల్యాబ్ కు పంపించడం జరిగింది. ఈ వైద్య శిబిరాలకు వచ్చిన కాలనీ వాసులకు అసంక్రామిత వ్యాధులు రక్త పోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైద్య శిబిరాలకు వచ్చిన కాలనీవాసులకు హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి సీజనల్ వ్యాధులు మలేరియా,డెంగీ, చికెన్ గున్య మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించి చెప్పడం జరిగింది. వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత మరియు డ్రై డే ల పై అవగాహన కల్పించనైనది. మహిళలకు ఆరోగ్య మహిళా ప్రోగ్రాం పై అవగాహన కల్పించనైనది. దోమల నివారణ మరియు అవి కుట్ట కుండా తీసుకోవలసిన జాగ్రత్తలను కాలనీ వాసులకు అవగాహన కల్పించనైనది. ఈ కార్యక్రమములో డాక్టర్ మహోన్నత పటేల్, హెల్త్ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ అరుణ,ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు మంజుల,రజిత మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాపిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

**సదస్సులో పాల్గొన్న ఎస్ ఐ మోహన్ బాబు**

హుజూర్‌నగర్ సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలోని ప్రజాభవన్ లో మంగళవారం ఐఎన్టీటీయూసీ అనుబంధ లోకల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాపిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ బాబు పాల్గొని మాట్లాడుతూ... ట్రాఫిక్ నియమ నిబంధనలు, ఇన్సూరెన్స్ బండి ఫిట్నెస్, డ్రైవర్ల కి ఓనర్లకి ఈఎస్ఐ సౌకర్యం సదుపాయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నిర్మూలనకు ఆటో డ్రైవర్లు సహకరించాలన్నారు. ఐఎన్టీటీయూసీ బ్లాక్ అధ్యక్షులు చిట్యాల అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు ఐఎన్టీటీయూసీ అండగా ఉంటుందన్నారు . ఈ కార్యక్రమంలో ఐఎన్టీటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య, మండల అధ్యక్షులు మేళ్లచెరువు ముక్కంటి, లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ రఫీ, పచ్చిపాల లింగరాజు, రాంబాబు, కొల్లూరి రాము బల్వత్ సింగ్. జక్కుల కృష్ణ లతీఫ్ చెడపొంగు సాయి, బైరు సతీష్ శివ తారక్ తదితర కార్మికులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

హుజూర్‌నగర్ సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి) హుజూర్ నగర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారి భూక్య సైదా నాయక్ పాల్గొని మాట్లాడుతూ... రేపటి భావి భవిష్యత్తు తరానికి ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. ఈ డిజిటలైజేషన్ యుగములో విద్యార్థిని ఎంతో గొప్పగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను శాలువా మెమెంటో పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి లావణ్య, ప్రధానోపాధ్యాయులు పెనుగొండ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నలబోలు శ్రీనివాస్ రెడ్డి, దాడి నర్సిరెడ్డి, జహర్ అలం, మఠంపల్లి మండల విద్యాధికారి వెంకటాచారి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అంకతి అప్పయ్య వేముల శ్రీనివాస్ రాజశేఖర్ రెడ్డి అత్తి వెంకటేశ్వర్లు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు.



## బీసీలు సోయితో మెలగాలి

**సీనియర్ కాంగ్రెస్ నాయకులు విహెచ్ హనుమంత రావు**

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 16 : బీసీలు బీసీ భావజాలాన్ని పెంచుకుని మరింత సోయి తో మెలగాలని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ రాజ్య సభ సభ్యులు విహెచ్ హనుమంతరావ్ అన్నారు. ప్రముఖ బీసీ సాహిత్యకారుడు డా.చింతం ప్రవీణ్ కుమార్ రాసిన సోయి బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కణ సందర్భంగా అయన మాట్లాడారు. కాంగ్రెస్ లీగల్ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అక్కల తిరుపతి వర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ క్లబ్ ప్రాంతంలో విహెచ్ చేతుల మీదుగా సోయి పుస్తకం ఆవిష్కరించబడ్డది. భావజాల వ్యాప్తి అనేది బీసీ ఉద్యమంలో అత్యంత ముఖ్యమైన విషయమని, ఈ సోయి పాత్రను సంపూర్ణంగా పోషించిందని విహెచ్ అన్నారు. ఈ సందర్భంగా అక్కల తిరుపతి వర్మ మాట్లాడుతూ గతంతో పోల్చితే ఇప్పుడు బీసీ ఉద్యమాలు అత్యంత చైతన్యవంతంగా ఉన్నాయని గ్రౌండ్ లెవెల్ కి ఈ ఉద్యమం ఇంకా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి,లక్ష్మణ్,శ్రీకాంత్ గౌడ్,హైకోర్టు అడ్వకేట్ ఈసీ మెంబర్ ముత్తే అంజలి దేవి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్



వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 16 : వరంగల్ తూర్పు దూపకుంటలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను దేశాయిపేట్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ ఆఫీస్ ను కొండా మురళీధర్ మంగళవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కొండా మురళీధర్ మాట్లాడుతూ నూతన కలెక్టర్ ఆఫీస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు.పేదల కల సహకారం అయ్యేలా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా అయన తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని ఈ సందర్భంగా కొండ మురళి తెలిపారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే త మా లక్ష్యం అని కొండా మురళిధర్ ఈ సందర్భంగా తెలిపారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం, 17 సెప్టెంబరు 2025



## ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఇల్లందకుంట సెప్టెంబర్ 16 (వాయిస్ టుడే): శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇల్లందకుంట గ్రామ దేవాలయం లో మంగళ వారం రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టుట మరియు స్వామివార్లను ఊరేగింపుగా పల్లకిలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ ఆ దేవుని ఆశీస్సులు మన అందరి పైన ఎల్లవేళలా ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామ్ స్వరన్ రెడ్డి, ధర్మకర్తలు పరమేష్, గోపాల్ రెడ్డి, కిషన్ రెడ్డి ,మల్లేష్, జూనియర్ అసిస్టెంట్ మోహన్ ,మల్లారెడ్డి ఆలయ అర్చకులు దేవస్థాన సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.



## నెరవేరనున్న గన్నేరువరం మండల వాసుల వంతెన కల

**రూ.77 కోట్లు మంజూరుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం**

మానకొండుర్, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే):ఎన్నో ఏళ్లుగా మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలన్న గన్నేరువరం ప్రజల కల త్వరలోనే సాకారం కానుంది.ఈ వంతెన నిర్మాణానికి రూ.77కోట్ల నిధులను కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేయడం ఇందుకు కారణం.గన్నేరువరం మండలం గుండ్లపల్లి నుంచి కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వరకు వెళ్లే మార్గంలో మానేరు నదిపై హైలెల్ వంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరే ఈ నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరుపై మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మానేరు నదిపై వంతెన నిర్మించే విషయమై ప్రతిపాదనలు,అంచనాలు తయారు చేయించి రాష్ట్ర ముఖ్యమంత్రికి అందించడమే కాకుండా ఈ విషయంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు పలు మార్లు కోరినట్టు ఆయన చెప్పారు. కరీంనగర్ లో, హైదరాబాద్ లోనే కాకుండా పలుమార్లు ఢిల్లీకి వెళ్లి బండి సంజయ్ కుమార్ కలిసి కోరినట్టు ఆయన గుర్తు చేశారు.అయినప్పటికీ ఏమాత్రం నొచ్చుకోకుండా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సమస్యను వివరించి వంతెన నిర్మాణానికి నిదులు మంజూరు చేయించారని ఎమ్మెల్యే కొనియాడారు.నిధుల మంజూరు చేసిన నితిన్ గడ్కరీ,మంజూరు కోసం కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి కుమార్,రాష్ట మంత్రి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.మానేరుపై వంతెన నిర్మాణం కోసం చాలా కాలంగా సాగించిన ఫోరాటాలతోనే ఇది సాధ్యపడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ం

## నేటితెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించండి

**ప్రతి పోలింగ్ బూత్ లో జాతీయ జెండా ఎగరవేయండి.**

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే)సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించాలని, జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో జాతీయ జెండా ఎగరవేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రను మరో మలుపు తిప్పిన రోజని , శతాబ్దాల బానిస సంఖ్యలను తుంచేసిన ఉద్విగ్న సందర్భమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడాదైనా ఇంకా స్వేచ్ఛ కోసం ఎదురు చూసింది కేవలం తెలంగాణ సమాజమేనన్నారు. నిజాం నిరంకుశత్వానికి,రజాకర్ల రౌడీల ,దాష్టికానికి ,బానిస బ్రతుకుల సంకెళ్ళకి విముక్తి జరిగి తెలంగాణ సమాజం నిజమైన స్వాతంత్రం పొందిన రోజు సెప్టెంబర్ 17 అని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని సొంత జాగీర్గా భావించి ఈ సంస్థానాన్ని పాకిస్తాన్లో కలపాలని చూసిన నిజాం రాజు కలలు కల్లలయిన రోజు సెప్టెంబర్ 17 అని ఆయన గుర్తు చేశారు.రజాకర్ వారసుల పార్టీ ఎంఐఎం అడుగులకు మడుగులొత్తేనేటి కాంగ్రెస్, నాటి టిఆర్ఎస్ సర్కార్లు విమోచన దినోత్సవ వేడుకలపై నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. సమైక్యత దినోత్సవం పేరుతో నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం ,ప్రజాపాలన దినోత్సవం పేరుతో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవ స్ఫూర్తిని మంటలో కలపడమే మార్గంగా పెట్టుకుందని ఘాటుగా విమర్శించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారిక తెలంగాణ విమోచన వేడుకలు హైదరాబాద్లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అలాగే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## పోషణ మాసోత్సవాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లికి సర్కార్ ఆహ్వానం

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16(వాయిస్ టుడే): మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా రేపటి నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పోషణ మాసం మహెూత్సవంలో భాగస్వాములు కావాలంటూ మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పంపించిన ఆహ్వానాన్ని కరీంనగర్ జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి అందజేశారు. అంతేకాకుండా నెలరోజులపాటు రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను కూడా ఆమె అందించారు.





## ఖో-ఖో టోర్నమెంట్ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాలలో యాదాద్రి జిల్లా స్థాయి ఖో-ఖో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ ఖో-ఖో టోర్నమెంట్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యని విద్యార్థులు,ఘనస్వాగతం పలికారు.ఆ తర్వాత జాతీయ,క్రీడాకారుల పతాకాలను ఆవిష్కరించి,క్రీడలను ప్రారంభించారు.



## వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

తిమ్మాపూర్ ,సెప్టెంబర్ 16(వాయిస్ టుడే):ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీరాజ్ అధికారులు ఆదేశించారు.ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితితోపాటు వివిధ అభివృద్ధి పనులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలు,వరదల వల్ల మానకొండూర్ నియోజకవర్గం వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల గురించి ఎమ్మెల్యే అధికారుల నుంచి ఆరా తీశారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తుల విషయమై ప్రభుత్వానికి ఏమైనా ప్రతిపాదనలు పంపారా అని ఆయన సమావేశంలో ప్రశ్నించారు. మండలాల వారీగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ రహమాన్, డెప్యూటీ ఈఈలు మంజులాభార్గవి, రవి ప్రసాద్, ఏఈలు సురేందర్ రెడ్డి, ప్రవీణ్, మల్లేశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## భువనగిరి నుంచి గజ్వేల్ వెళ్లే జాతీయ రహదారి నిర్మాణం కోసం 7 కోట్లు నిధులు మంజూరు

**- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భువనగిరి అభివృద్ధిపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్,నేషనల్ హైవే డి ఈ, ఏఇ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగదేవ్ పూర్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాధాలపై గత వారం రోజుల క్రితం అధికారులతో మాట్లాడి ఆ రోడ్డుపై ఒక నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఆ నివేదికను పలు సమస్యలతో కూడిన విషయాలను సంబంధిత అధికారులు ఎమ్మెల్యేకి అధికారులు ఇవ్వడం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భువనగిరి నుంచి గజ్వేల్ వెళ్లే జాతీయ రహదారి 70 కిలోమీటర్లు వరకు రోడ్డు మరమ్మత్తు పనులకు 7 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు.భువనగిరి పట్టణంలోని జగదేవ్ పూర్ బ్రిడ్జి మరమ్మతులకు 76 లక్షల రూపాయల మంజూరు అయ్యాయి త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలియజేశారు. భువనగిరి పట్టణంలో అన్ని చౌరస్థాల సుందరీకరంగా తీర్చిదిద్దుతామని,భువనగిరి పుర ప్రముఖులు వివిధ పార్టీ నాయకులతో సమావేశమై ప్రతి ఒక్క సమస్యపై చర్చించి భువనగిరిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కుంభం తెలియజేశారు.

## వెల్డింగ్ కార్మికులు అండగా ఉంటాం.. వారి అభివృద్ధికి కృషి చేస్తాం

**- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి ఇంజనిరింగ్ ప్యాబిరికేషన్ వర్క్స్ అసోసియేషన్ కార్మికులు మంగళవారం రోజు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాములపర్తి నరేంద్ర మాట్లాడు తు భువనగిరి పట్టణం లో 1000గజాల స్థలం ఇవ్వాలి అని తెలిపారు. అందులో మేము అందరం ఒకే చోట పని చేసుంటాం అని తెలిపారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా యూనియన్ తరుపున ఎమ్మెల్యే కు శాల్వా తో సత్కరించారు. ఈ కార్యక్రమం లొ వనాల డేవిడ్ రాజ్, ఎండీ జహంగీర్ బాబా, మారబోయిన శంకర్, గడ్డం నర్సింహా,ఎండీ కదీర్, శ్రీనివాస్, పల్లెపాటి రాము, సయ్యద్ ఇందాద్, పురుషోత్తం,ఎండీ జబ్బార్, తదితరులు పాల్గోన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను అందుకుని క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను అందుకుని క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. టెకవండో నేషనల్ లెవల్ సిల్వర్ మెడల్,రాష్ట్ర షూటింగ్ గోల్డ్ మేడల్ ను సాధించిన భువనగిరి పట్టణానికి చెందిన టెదయ్యాలా వినూత్న ను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెకవండో నేషనల్ లెవల్ సిల్వర్ మెడల్,రాష్ట్ర షూటింగ్ గోల్డ్ మేడల్ సందించిన వినూత్న ను శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారికి అండగా ఉంటా అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీ ని డిక్లర్ చెయ్యడం సంతోషంకరమని,రానున్న రోజులు లొ ఒలోంపిక్స్ క్రీడలు రాష్టం ఏర్పాటు చెయ్యాలని, ముందు చూపుతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లొ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, దేవేందర్ తదితరులు పాల్గోన్నారు.

## పరమానందభరితంగా సీతారామ కల్యాణం



భద్రాచలం: భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి అర్చన చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య ఇక్కడ దర్శనం ఇవ్వడం భక్తులు చేసుకున్న అదృష్టమని వైదిక పెద్దలు ప్రవచించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగళ్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆంజనేయస్వామివారికి అభిషేకం నిర్వహించి అర్చనలు చేశారు. జైశ్రీరాం, జైహనుమాన్ అంటూ నీరాజనాలు పలికి హనుమాన్ చాలీసాను పఠించారు. సిద్దిపేటలోని గురునంద నంద సరస్వతీ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతిస్వామి రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారికి అనుబంధంగా ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారిని అంజన్నను దర్శించుకున్నారు. ఈఓ దామోదర్‌రావు, ఏఈఓ శ్రావణ్‌కుమార్, పీఆర్వో సాయిబాబా సాదర స్వాగతం పలకగా స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకుడు విజయరాఘవన్ నేతృత్వంలో వైదిక పెద్దలు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలందించారు.